సీపీ శ్వేతను మర్యాద పూర్వకంగా కలిసిన నూతన ఎస్ఐలు

సిద్దిపేట రూరల్, అగస్టు 1, ప్రభాతవార్త :

జిల్లాలో ఇటీవల వివిధ పోలీసు స్టేషన్లకు బదిలీపై వచ్చిన ఎస్ఐలు బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంగళవారం సీపీ కార్యాలయంలో సీపీ శ్వేతను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలను అందించారు. చిన్నకోడూరు ఎస్ఐగా నూతనంగా విచ్చేసిన సుభాష్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించి సీపీ కార్యాలయంలో సీపీ శ్వేతను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కలను అందిం చారు. అలాగే బెజ్జంకి ఎస్ఐ నరేందర్‌రెడ్డి, జగదేవాపూర్ ఎస్ఐ చంద్రమోహన్, రాజగోపాల్‌పేట ఎస్ఐ మోహన్‌రెడ్డి, కోహెడ ఎస్ఐ తిరుపతి, మర్కుక్ ఎస్ఐ శ ంకర్. కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ రాజేష్, ఎస్‌బి ఎస్ఐ కృష్ణ, టూ టౌన్ ఎస్ఐ శ్రీనివాస్‌లు సీపీ శ్వేతను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కలను అందించారు. ఈ సందర్భంగా నూతనంగా విచ్చేసి బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐలను సీపీ శ్వేత అభినందించారు. ప్రజలకు ఎల్లావేళాల అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. శాంతిభద్రతలకు భంగం కలగకుండా విధులు నిర్వహించాలన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

వసతి గృహాన్ని తనిఖీ చేసిన న్యాయమూర్తి

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 1, ప్రభాతవార్త: మండలంలోని కొత్లాపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతి బాపులూ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె హన్మంతరావు మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వుల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి సుదర్శన్ సూచనల మేరకు కొత్లాపూర్‌లో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించి పాఠశాల, కళాశాలలను పరిశీలించి వసతి గృహంలో విద్యార్థులకు అందచేస్తున్న భోజనాన్ని, వంట గదులను, కూరగాయలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి, ప్రజలు తమ ప్రాథమిక హక్కులను, విధులను తెలుసుకుని ఉండాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు వారి హక్కులు, విధుల గురించి పలు ప్రశ్నలు వేసి సమాదానాలు రాబట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కిషన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

మల్లన్నసాగర్ పునరావాస కాలనీలో సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలి : జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :

మల్లన్నసాగర్ పునరావాస కాలనీలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం మల్లన్నసాగర్ ముంపు గ్రామాలైన ఎర్రవెల్లి, సింగారం, ఏటిగడ్డకిష్టాపూర్, రాంపూర్, బ్రాహ్మణబంజేరుపల్లి, లక్ష్మాపూర్, పల్లెపహాడ్, వేములఘాట్ సర్పంచ్‌లు, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పునరావాస కాలనీలలో సౌకర్యాలపై చర్చించి ఆయన మాట్లాడారు. మల్లన్నసాగర్ పునరావాసంలో భాగంగా కేటాయించిన ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ దాదాపు పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన వారికి త్వరలోనే రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. పునరావాస కాలనీలలో విద్యుత్, సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తేస్తే పరిష్కరిస్తానని తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అర్డీఓలు రమేష్, బన్సీలాల్, విద్యుత్, అర్‌డబ్ల్యుఎస్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు
సమన్వయంతో పనిచేయాలి
జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేట రూరల్(చిన్నకోడూరు), అగస్టు 1, ప్రభాతవార్త :

డంప్ యార్డును పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దకోడూరు, మెట్టుపల్లి గ్రామాల్లో పర్యటించి శ్మశానవాటిక, నర్సరీలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారుల ప్రజలకు ఎల్లావేళల అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బట్టు లింగం, సింగిరెడ్డి విజయలక్ష్మి వినయ్‌రెడ్డి, ఎంపిటిసి సాయన్న, ఎంపిడిఓ శ్రీనివాస్, ఈవో సోమిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు ఉన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ...

చిన్నకోడూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి ఆరోగ్య మహిళ ప్రోగ్రాం వివరాలు తెలుసుకున్నారు. మహిళలను రక్తహీనత నుంచి బయట పడాలంటే వైద్యులు చెప్పిన సూచనలు పాటించాలన్నారు. ఆరోగ్యానికి మేలు చేసే కూరగాయలు, ఆకు కూరలు తినాలన్నారు. ప్రతి మహిళ బాగుంటేనే కుటుంబం బాగుటుందన్నారు. కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ కాశీనాథ్, ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ రజని, పిహెచ్‌సి వైద్యాధికారి సరిత, సిహెచ్ఓ సూర్యప్రకాష్, ఎంపిడిఓ శ్రీనివాస్, సర్పంచ్ కాముని ఉమేష్‌చంద్ర, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ పర్యటనకు రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :

సిద్దిపేట జిల్లాకు చెందిన జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు వంగ నాగిరెడ్డి ఇజ్రాయిల్‌లో పర్యటించనున్నారు. వ్యవసాయంలో కొత్త పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం అధ్యయనం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 30 మంది ప్రతినిధులను ఎంపిక చేసింది. బృందం సభ్యులు ఈనెల 5 నుంచి ఐదు రోజుల పాటు పర్యటించి అక్కడి వ్యవసాయ పద్ధతులపై అధ్యాయనం చేయనున్నారు. బృందానికి ఉద్యన వనశాఖ డైరెక్టర్ హన్మంతరావు నాయకత్వం వహించనున్నారు.

మర్కుక్‌ను సందర్శించిన బిజెపి నేతలు

మర్కుక్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపి జితేందర్‌రెడ్డి

మర్కుక్, ఆగస్టు 1 (ప్రభాతవార్త): మండలకేంద్రం మర్కుక్‌ను మంగళవారం మాజీ ఎంపి, బిజెపి నాయకులు జితేందర్‌రెడ్డి జిల్లా నాయకులు, మండల పార్టీ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు కూలిపోయిన, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్ళను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆ కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. అనంతరం మాజీ ఎంపి జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ కూలిపోయిన ఇళ్ళ కుటుంబాలకు బిజెపి అండగా ఉంటుందని, బిజెపి అధికారంలోకి రాగానే వారి కుటుంబాలకు సొంత స్థలంలో ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు. కెసిఆర్ ప్రభుత్వం హయాంలో డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇస్తామని మాయమాటలు చెప్తున్నారే తప్ప ఎక్కడ ఇచ్చిన దాఖలాలు లేవని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాములు, ఓబిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గర్నెపల్లి కృష్ణమూర్తి, పేర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : రజితవెంకన్న

హుస్నాబాద్, ఆగస్టు 1 ప్రభాతవార్త : ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని 12,13వ వార్డులో మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరై ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మొక్కలు తీసుకున్న ప్రతీ ఒక్కరు ఆ మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలన్నారు. ప్రతీ ఇంట్లో చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి మున్సిపల్ కార్మికులకు అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, వైస్‌చైర్మెన్ అయిలేని అనిత శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు బొల్లి కల్పనశ్రీనివాస్, గూళ్ల రాజు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రవికుమార్‌తో పాటు తదితరులు పాల్గొనా న్నరు.

మల్లన్నసాగర్‌తో ఒరిగిందేమి లేదు

- దమ్ముంటే మంత్రి తన్నీరు హరీష్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి చర్చకు రావాలి
- నీళ్ల దొంగలు మామా అల్లుళ్లే
- టిపిసిసి నేతలు సుప్రభాతరావు, బాలకృష్ణ సవాల్

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు1 ప్రభాతవార్త:

కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుటుంబం గొప్ప చెప్పుకుంటున్న మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ ద్వారా రైతులకు దక్కింది సున్నా ప్రయోజనమేనని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నేతలు చౌదరి సుప్రభాతరావు, మ్యాడం బాలకృష్ణ తేల్చేశారు. మంగళవారం మెదక్ పట్టణంలోని మహబూబ్ నహర్ కెనాల్ కాలువ నుండి బొల్లారం మత్తడి వరకు కాంగ్రెస్ నేతలతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా వారు బొల్లారం మత్తడిని పరిశీలించారు. కాలువ దుస్థితికి రాష్ట్ర మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మాత్రమే బాధ్యులని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలకోట్ల రూపాయలతోకట్టిన మల్లన్నసాగర్ ఇప్పుడు పని చేయడం లేదని, నిజాం హయాంలో నిర్మించిన ఘనపురం ప్రాజెక్ట్ నీటితో బొల్లారం మత్తడి దూకి అలుగు పారుతుందన్నారు. కేసీఆర్ కల్లబొల్లి మాటలకు బొల్లారం మత్తడి సాక్ష్యంగా నిలిచిందన్నారు. ఈ విషయం తేల్చేందుకే బొల్లారం మత్తడిని సందర్శించామని, మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిలకు దమ్ముంటే చర్చకు సిద్ధ పడాలని సవాల్ విసిరారు. లేదంటే కేసీఆర్ కట్టిన ఎత్తిపోతలు ఉత్త పోతలేనని ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. సమజసిద్ధమైన నీటి వనరులతో విరాజిల్లుతున్న మెదక్ జిల్లాను నాశనం చేయాలనే సంకల్పంతో మంత్రి హరీష్‌రావు పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘనపురం ప్రాజెక్టును మించిన నీటి వనరు రాష్ట్రంలో ఎక్కడాలేదని, అలాంటి ప్రాజెక్టుకు పట్టిన గ్రహణం హరీష్‌రావు, పద్మాదేవేందర్‌రెడ్డిలు మాత్రమేనని ధ్వజమెత్తారు. 9 ఏళ్ల క్రితం ప్రారంభించిన కాలువల మరమ్మతుపనులు ఇంకా ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. దీనికి స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మంత్రి హరీష్‌రావులే బాధ్యులని తేల్చేశారు. మెదక్ జిల్లా ప్రజలకు నీళ్ల దక్కకుండా మామా అల్లుళ్ల కుట్రపన్నారని, అందులో భాగంగానే మల్లన్నసాగర్ అనే ప్రాజెక్టును బూచిగా చూపారని ఆరోపించారు. అందుకే వారిని నీళ్ల దొంగలు అంటామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గోవర్ధన్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు అశోక్‌నాయక్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్, ఎంపీటీసీలు ప్రసాద్‌గౌడ్, గొండ స్వామి, విక్రమ్, కాంగ్రెస్ నాయయకులు డాకి స్వామి, నాగిరెడ్డి, అల్లాడి వెంకటేష, దండు శివకుమార్, పంతులు బూమన్న, అఫ్సర్, బాచారం కృష్ణ, మదూరి నవీన్, డాకి నాగేందర్, నవీన్, సంతప్ప, సల్మాన్, జాకీర్, జకేరియా, వివిధమండలాల నుంచి వచ్చిన వంద మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుప్రభాతరావు, మ్యాడం బాలకృష్ణ

తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం కావాలి

- అవినీతి రాజ్యాన్ని తరిమికొడదాం..
- ఆత్మగౌరవ యాత్రలో గడప గడపకు కాంగ్రెస్
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే రైతులకు 2 లక్షల రుణమాఫీ
- ఆసరా పెన్షన్‌లు 4 వేల రుపాయల వరకు పెంపు
- 500 రుపాయలకే వంట గ్యాస్
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

రామాయంపేట, ఆగస్టు 1, ప్రభాతవార్త:

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుపాయల రుణమాఫీపై మొదటి సంతకం చేయనుందని కాంగ్రెస్‌పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం రామాయంపేట మండలంలోని ఝాన్సిలింగాపూర్‌లో చేపట్టిన ఆత్మగౌరవ యాత్రలో భాగంగా గడపగడపకు పల్లె, పల్లెకు కాంగ్రెస్ అనే నినాదంతో ప్రారంభించారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయడం జరుగుతుందని చెప్పారు. అలాగే పేదలకు ఇండ్లు కట్టుకోవడానికి స్థలాలు ఉంటే రూ. 5 లక్షలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మహిళలకు కర్ణాటక రాష్ట్రంలో ఏ విధంగా ఉచితంగా బస్ ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందో అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలోని మహిళలకు ఉచితంగా బస్ ప్రయాణం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఆసరా పింఛన్ రూ. 4 వేల పెంచనున్నట్లు తెలిపారు. మెదక్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి చేసింది ఏమి లేదని ఆమె నియోజకవర్గానికి ఒరగబెట్టిందని ఏమి లేదని, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఎద్దేవా చేశారు. ఏ పల్లెలో కూడ కనీస రోడ్లు కూడా సరిగ్గా లేవన్నారు. పదేండ్ల తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యే నియోజకవర్గానికి నయా పైసా కూడ అభివృద్ధి చేసింది ఏమి లేదని ఆయన ఎద్దేవా చేశారు.

ఆత్మగౌరవ యాత్రలో భాగంగా ఇంటింటిక వెళ్లి ప్రచారం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

మాట్లాడుతున్న బొమ్మ శ్రీరాంచక్రవర్తి

మూడు ముక్కల ఆట ఆడుతున్న ఎమ్మెల్యే
-హౌజ్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి

హుస్నాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త : ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ నియోజకవర్గంలో మూడు ముక్కల ఆట ఆడినట్లు నియోజకవర్గ ప్రజలతో ఆటలు ఆడుతున్నారని మాజీ హౌజ్‌ఫెడ్ చైర్మన్, బిజెపి నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ స్థానికుల అభిప్రాయాన్ని తీసుకోకుండానే పోతారం(ఎస్), గాంధీనగర్ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయాలని కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపడాన్ని తప్పుపట్టారు. గ్రామాలను మున్సిపాలిటీలో కలపడం వల్ల గ్రామీణ ప్రజలకు ఉపాధి హామీ పనిలేకుండా పోవడంతోపాటు ఇంటి పన్ను, నల్లా బిల్లులు పెరిగి ఆర్థికంగా ఇబ్బందులు పడతారని గుర్తు చేశారు. తమ పార్టీ నాయకులకు న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే విలీనం చేయాలను కుటుంన్నారని ఆరోపించారు. ప్రజల అభిప్రాయం మేరకు విలీనాన్ని మానుకోవాలని హితవు పలికారు. లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జనగామ వేణుగోపాల్‌రావు, దొడ్డి శ్రీనివాస్, కోమటి స్వర్ణలత, బాణాల జయలక్ష్మి, చెక్కబండి విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల్లో ఘనంగా పల్లకి సేవ

పాపన్నపేట, ఆగస్టు 1, ప్రభాతవార్త:

పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గ భవాని మాత ఆలయ పరిసరాల్లో పౌర్ణమి పర్వదినాన్ని పురష్కరించుకుని మంగళవారం రాత్రికి అమ్మవారి ఉత్సవ విగ్రహం పల్లకి సేవను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఆలయ ఇఓ సార శ్రీనివాస్ భాజా భజంత్రీలతో అమ్మవారి ఆలయంలో మూలవిరాట్ విగ్రహానికి ఆలయ అర్చకులు శంకర శర్మ, పార్థివ శర్మ వేద మంత్రాలు వల్లిస్తుండగా పూజా కార్యక్రమాలు నిర్వహించి అందంగా ముస్తాబు చేసిన పల్లకిలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్టించుకుని ఆలయం నుంచి పల్లకి సేవను ఊరేగిస్తూ శివాలయం మీదుగా రాజగోపురం గుండా తిరిగి ఆలయానికి చేరుకుంది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, సాయిబాబా, విఠల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు. పల్లకి సేవలో ఆయా గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పునీతులు అయ్యారు.

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గజ్వేల్ టౌన్ ఆగస్టు 1, ప్రభాతవార్త : గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాల పెంపు కోసం వచ్చిన జీవో నంబరు 60ని పకడ్బంధీగా అమలు చేసి కార్మికులపై పని భారం పెంచే జీవో నంబరు 51 మల్టీపర ్పస్ విధానాన్ని రద్దు చేయాలని ఎమ్మార్పీఎస్ పొలిట్‌బ్యూరో సభ్యులు మైస రాములు, మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నీరుడి స్వామి, సాహసం జిల్లా అధ్యక్షులు కొడకండ్ల నర్సింలు, తెలంగాణ అంబేద్కర్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డాక్టర్ చిప్పల యాదగిరిలు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది గజ్వేల్ ఐఓసీ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారంతో 27వ రోజుకూ చేరుకుంది. ఈ సందర్భంగా వారు పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలన్నారు. గ్రామ పంచాయతీ జెఎసి నాయకులను ప్రభుత్వం చర్చలకు పిలిచి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు అనిల్, రాజయ్య, చంద్రం, యాదగిరి, రాజు, కుమార్, దేవేందర్, రాజమణి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

వినూత్న రీతిలో పంచాయతీ కార్మికుల నిరసన

కొమురవెల్లి, అగస్టు 1, ప్రభాతవార్త : పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బిల్ కలెక్టర్లు, కారోబార్లను సహాయ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారంతో 27వ రోజుకూ చేరుకుంది. ఈ సందర్భంగా మోకాళ్లపై నిలబడి విన్నూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ఉద్యోగ, పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలని జీవో నంబరు 51 వెంటనే సవరించాలని పిఎఫ్ఎ, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మల్టీపర ్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల జెఎసి చైర్మన్ బ్రాహ్మాండ్లపల్లి పర్శరాములు, జెఎసి మండల నాయకులు తాడూరి రాజలింగం, పులగం కృష్ణమూర్తి, దొంతరబోయిన సాయిలు, రోడ్డ నరిసింహులు, సార్ల శ్రీనివాస్, లకమల్లు ఉప్పలమ్మ, లింగపల్లి పుష్ప, రవి, కనకరాజు, కూర మహేష్, నీరటి అక్కయ్య, రాజు, అరవింద్, రాజు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు

66 మంది బాల కార్మికులకు విముక్తి

జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ అర్బన్, ఆగస్టు 1 ప్రభాతవార్త:

ఆపరేషన్‌ముస్కాన్ బృందం దాడుల్లో 66 మంది బాల కార్మికులకు విముక్తి లభించింది. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని మాట్లాడుతూ బాల్యమంటే ఒక నవ్వుల దొంతర, ఆట పాటల పరంపర అని అన్నారు. బడికి వెళ్లాల్సిన బాలలు కష్టతరమైన పనుల్లో కష్టపడటం సమాజాభివృద్ధికి ఆటంకం అని, జాతిని సవాల్ చేస్తున్న బాల కార్మిక సమస్య ఇంకనూ కొనసాగుతూనే ఉందని, ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం వివిధ చర్యలను చేపడుతుందన్నారు. దీన్ని రూపుమాపేందుకు మెదక్ జిల్లా ఆపరేషన్ ముస్కాన్ పోలీస్ బృందం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్‌మెంట్, సఖి సెంటర్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంట్, వివిధ డిపార్ట్‌మెంట్ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ బృందం దాడుల్లో కిరాణం షాప్‌లలో, మెకానిక్ షాప్‌లలో, హోటళ్లలో పనిచేస్తూ, వదిలేయబడిన పిల్లలు, రోడ్డుపై భిక్షాటనచేస్తున్న పిలలు బాల కార్మికులు పనిచేస్తున్న పిల్లలను గుర్తించి 66 మందిని పట్టుకొని సంబంధిత అధికారుల ద్వారా వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించామని తెలిపారు. అలాగే బాలలను పనిలోపెట్టుకున్నవారిపై 4 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇందులో బాలురు 58, బాలికలు 8, ప్రక్క రాష్ట్రాల బాలురు 11 మంది ఉన్నారు. చిన్నపిల్లలు వెట్టిచాకిరికి గురి కాకుండా వారి మొహంలో చిరునవ్వులు చిందించేలా ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని సూచించారు. ప్రజలు ఎవరైనా బాల కార్మికులను పని పెట్టుకున్నా, లేక వారితో బలవంతంగా పని చేయించిన, ఒంటరిగా బాధపడుతున్న బాలలను చూసినప్పుడు, ఆశ్రయం అవసరమై తప్పిపోయిన, వదిలివేయబడిన బాలలను చూసినప్పుడు, శారీరకంగా మానసిక, లైంగిక దోపిడీకి గురవుతున్న బాలలను చూసినప్పుడు, హింసకు బెదిరింపులకు గురవుతున్న వీధి బాలలను చూసినప్పుడు, 1098 లేదా డయల్ 100, 112కు సమాచారం అందించాలని సూచించారు. సమా చారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

రాష్ట్ర క్యాబినెట్‌లో పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెపై చర్చించకపోవడం సరికాదు
సమస్యలు పరిష్కరించకుంటే అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటాం

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :

రాష్ట్ర కేబినెట్ సమావేశంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెపై మంత్రి మండలి చర్చించకపోవడం సరికాదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం అవరణలో గ్రామ పంచాయతీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారంతో 27వ రోజుకూ చేరుకుంది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు వంటావార్పు నిర్వహించి అక్కడే సహాపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా అయన పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న అట్టడు వర్గాలకు చెందిన కార్మికుల సమస్యలపై మంత్రి మండలి సమావేశంలో కనీసం చర్చకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే వర్షాకాల అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటమన్నారు. వంటావార్పు కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్‌కుమార్, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు యాదగిరి, రాయనర్సు, మల్లయ్య, ఎల్లయ్య, యాదగిరి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ పార్టీని గద్దె దించడమే లక్ష్యం
మాజీ ఎంపి, బిజెపి నాయకుడు జితేందర్‌రెడ్డి

కూలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న జితేందర్‌రెడ్డి

వర్గల్, ఆగస్టు 1 (ప్రభాతవార్త): బిఆర్ఎస్ పార్టీని గద్దె దించడమే లక్ష్యమని మాజీఎంపి, బిజెపి నాయకులు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని సింగాయిపల్లి, గౌరారం, చౌదరిపల్లి గ్రామాల్లో బిజెపి రాష్ట్ర నాయకుడు పూదరి నందన్‌గౌడ్‌తో కలిసి వర్షాల కారణంగా కూలిపోయిన ఇండ్లను పరిశీలించారు. అంతకు ముందు గౌరారం వద్ద ఉన్న ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాలకు సాధారణ ప్రజల జీవితాలు అతలాకుతలం అయ్యాయని, ప్రభుత్వం రాష్ట్రంలో ఎవరినీ పట్టించుకోవడంలేదన్నారు. రైతులు అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతున్నా కనీసం సిఎం కెసిఆర్ పట్టించుకోవడంలేదన్నారు. కేంద్రం నుంచి తెచ్చిన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయకుండా దుర్వినియోగం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ, మెదక్ పార్లమెంట్ కన్వీనర్ రాంమోహన్‌గౌడ్, గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, బిజెవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మఠం మహిపాల్‌యాదవ్, మండల అధ్యక్షుడు శ్రీరామ్ శ్రీకాంత్, మండల పదాధికారులు మోర్చల నాయకులు, బూత్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాలకు అండగా 'ఆపన్నహస్త మిత్ర బృందం'

ఎమ్మెల్యే సీతక్క చేతులమీదుగా సరుకులను అందజేస్తున్న దృశ్యం

గజ్వేల్, ఆగస్టు 1 (ప్రభాతవార్త): భారీ వర్షాలతో కట్టుబట్టలు మినహా ఏమిమిగల్చకుండా ఇండ్లు, ఆస్తులు నామరూపాలు లేకుండా వరదపాలైన ములుగు జిల్లా మేడారం, కల్వపల్లి, కొండాయి, ప్రాజెక్టునగర్ గ్రామాల్లో సహాయం అందించడానికి గజ్వేల్ పట్టణానికి చెందిన ఆపన్నహస్త మిత్ర బృందం సందర్శించారు. గత పది రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరదపాలైన కుటుంబాలకు ఆపన్నహస్త మిత్ర బృందం రూ.లక్ష విలువైన బియ్యం, కిరాణ సామాగ్రి, దుస్తులు, దుప్పట్లు, పండ్లు, బిస్కెట్లు ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాల కారణంగా గ్రామాలు వరదలో కొట్టుకుపోవడం చూసి బాధ కలిగిందని, వర్షం కారణంగా బ్రిడ్జి కూలిపోవడంతో మూడు గ్రామాల రాకపోకలు నిలిచిపోయి ప్రజల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. అన్నమో రామచంద్ర అంటూ బిక్కుబిక్కుమంటూ ఆపన్న హస్తం కోసం ఎదిరిచూస్తున్నారని, అలాంటి వారికి రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపన్నహస్త మిత్ర బృందం అధ్యక్షుడు పాశికంటి బాల్‌చంద్రం, ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, కోశాధికారి కొల్లూరి శ్యామ్‌ప్రసాద్, ఉపాధ్యక్షుడు మంగలి సాయి, సహాయ కార్యదర్శి కొలిచెలిమ స్వామి, సభ్యులు మంగలిపల్లి సత్యనారాయణ, రాజు, హనుమాన్‌దాస్, అనిల్, నరిలు, కోటిలింగం, కిష్టయ్య, వెంకటేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మానవీయ తప్పిదం వల్లే ఇళ్లల్లోకి, రోడ్లపైకి నీరు
-సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడే చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త : మానవీయ తప్పిదం వల్లే హుస్నాబాద్‌లో రోడ్లు, ఇళ్లల్లోకి నీరు వచ్చిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం ఆ పార్టీ నాయకులతో కలిసి 2008వ సంవత్సరంలో ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 83 లక్షలతో నిర్మించిన వరద మల్లింపు కాల్వ నిర్మాణం లాంటివి చేపడితే ఇప్పుడు వరద నీరు రోడ్లు ,ఇండ్లలోకి వచ్చేది కాదన్నారు. రోడ్లు, ఇండ్లలోకి నీరు రావడం మానవ తప్పిదమేనని వెంటనే సంబంధిత అధికారులు స్పందించి దిన, దిన అభివృద్ధి చెందుతున్న హుస్నాబాద్ పరిస్థితులకు అనుకూలంగా వర్షాలకు ఇండ్లు, రోడ్లపైకి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడిపె మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎడల వనేష్, సత్యనారాయణ, సంజీవరెడ్డి, శ్రీనివాస్, పద్మ, కొమ్ముల భాస్కర్, జనగాం రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

బండి సంజయ్ ను కలిసిన నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్

బండి సంజయ్‌ను కలిసిన మురళీయాదవ్

నర్సాపూర్, ఆగస్టు 1,ప్రభాతవార్త: బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కరీంనగర్ ఎంపి బండి సంజయ్ కుమార్ ను మంగళవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులైనందున బండిసంజయ్‌కుమార్ ను శాలువాతో సత్కరించి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమయంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నర్సాపూర్ మున్సిఫల్ చైర్మన్ మురళీయాదవ్ తో పాటు బిజెపి నాయకులు తదితరులున్నారు.

పిఆర్‌టియు టిఎస్ సభ్యత్వానికి విశేష స్పందన

నర్సాపూర్, ఆగస్టు 1, ప్రభాతవార్త: ఉపాధ్యాయుల సమస్యల సాధనే పిఆర్‌టియు టిఎస్ లక్ష్యమని పిఆర్‌టియు టిఎస్ మండల అధ్యక్షులు లక్ష్మినారాయణ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ మండలంలో పిఆర్‌టియు టిఎస్ సభ్యత్వ నమోదు 2023 కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. జడ్పిహెచ్ఎస్ బాయ్స్ నర్సాపూర్, ప్రాథమికపాఠశాల నర్సాపూర్, బ్రాహ్మణపల్లి, కాజీపేట్, రెడ్డిపల్లి, పెద్దచింతకుంట, అచ్చంపేట, మంతూర్, లింగాపూర్, తుజాల్‌పూర్, తదితర పాఠశాలలో ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగిందని తెలిపారు. ఈసభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తుందని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్న ఏకైక సంఘం పిఆర్‌టియు టిఎస్ అన్నారు. పదోన్నతులకు ఎటువంటి ఆటంకం లేనందున పదోన్నతుల షెడ్యూల్‌ను ప్రకటించాలన్నారు. త్వరలో ప్రభుత్వాన్ని ఒప్పించి నూతన పిఆర్‌సి కమిటీ ఏర్పాటు, ఈహెచ్ఎస్, ఐఆర్ లపై నిర్ణయం తీసుకునే విదంగా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు టిఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎల్‌కె. చందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సామ్యానాయక్ , రాష్ట్ర కార్యదర్శి వీరేశం, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు లాలునాయక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేసిన ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఆగస్టు 1 ప్రభాతవార్త: పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి అన్నారు. మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీకి చెందిన అజార్ నవాబ్ తండ్రి అఫ్జల్ నవాబ్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సిఎం సహాయనిధి నుండి రూ. 2,50,000 ఎల్‌వోసీ మంజూర ఉచేయించారు. మంగళవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి అజార్ కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మెదక్ పట్టణ అధ్యక్షులు ఎం. గంగాధర్, కౌన్సిలర్ జయరాజ్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఉమర్, నాయకులు రాగి అశోక్, జుబేర్ పాల్గొన్నారు.

కొల్చారం ఎస్ఐగా మహ్మద్ గౌస్

కొల్చారం, ఆగస్టు1 ప్రభాతవార్త: కొల్చారం నూతన ఎస్ఐగా మహమ్మద్ గౌస్ బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఈయన చిలిపిచెడ్ ఎస్ఐగా పనిచేశారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ సార శ్రీనివాస్‌గౌడ్ కామారెడ్డిజిల్లా మాచిరెడ్డి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. మండలంలో 3 సంవత్సరాల 9 నెలలు సేవలందించారు. అంతకుముందు బదిలీపై వెళ్తున్న ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ మంగళవారం మాట్లాడుతూ తాను పనిచేసిన ఈ పూర్తి కాలం తనకు సంతృప్తిని ఇచ్చిందన్నారు. ముఖ్యంగా మండలంలోని ప్రజలు అండగా ఉంటూ గ్రామాల్లో శాంతిని నెలకొల్పేందుకు సహకరించిన తీరు మరిచిపోలేనిదన్నారు. ఇదే సమయం లో వృత్తిరీత్యా తాను తీసుకున్న నిర్ణయాలు కఠినంగా ఉన్నా ప్రజల నుండి పూర్తి సహకారం అందిందన్నారు. తనకు సహక రించిన సిబ్బందికి, ఇదే సమయంలో మండలంలోని ప్రజాప్రతి నిధులకు, అన్ని వర్గాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నేడు కొల్చారం నూతన ఎస్ఐగా మహ్మద్ గౌస్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

అదుపు తప్పి కారు బోల్తా..

కొల్చారం, ఆగస్టు 1 ప్రభాతవార్త: మండల కేంద్రం శివారులోని మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై లోతువాగు మూలమలుపు వద్ద అదుపుతప్పి కారు బోల్తా పడిన సంఘటన మంగళవారం జరిగింది. త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ నుండి ఏడుపాయలకు వనదుర్గా భవాని అమ్మవారి దర్శనం కోసం వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలయ్యాయి. ప్రాణాలతో బయట పడ్డందుకు వారు ఊపిరి పీల్చుకున్నారు. కారు పాక్షికంగా దెబ్బతింది.

పేద కుటుంబానికి సహాయం

రామాయంపేట, ఆగస్టు 1, ప్రభాతవార్త: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ఇండ్ల బాధితులకు రెడ్ క్రాస్ సొసైటి తన వంతు సహాయం అందిస్తుంది. ఆపద సమయంలో రాష్ట్ర స్థాయిలో ఫోన్ కాల్ వచ్చినా, తక్షణ సహాయం అందించాలని తెలంగాణ రెడ్క్రాస్ రాష్ట్ర అధ్యక్షులు గవర్నర్ తమిళ సై సౌందరరాజన్, మెదక్ జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ అధ్యక్షుడు రాజర్షి షా ఆదేశానుసారం భారీ వర్షాల కారణంగా మెదక్ చర్చి కంపౌండ్‌లో గల టీ పల్స్ కుమార్ పేద,వృద్ధ దంపతుల ఇల్లు దెబ్బ తిన్నందువల్ల ఇండియన్ రెడక్ క్రాస్ సొసైటి మెదక్ శాఖ ద్వారా టార్పాలిన్ షీటు, నిత్యావసర సరుకులను ఇచ్చి దంపతులను ఓదార్చారు. మెదక్ జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షులు లయన్ డా,,ఏలేటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి టి.సుభాష్ చంద్రబోస్, కోశాధికారి డిజి శ్రీనివాస శర్మ, ఈసి మెంబర్స్ దేమే యాదగిరి, వి కైలాసం, తిరుమల శేషాచారి, చర్చ్ కంపౌండ్ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

రామాయంపేట, ఆగస్టు 1, ప్రభాతవార్త: అంబేద్కర్ కాలనికి చెందిన కాసర్ల మానయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షులు తిరుపతిరెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. మృతుడి అంత్యక్రియలకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చింతల యాదగిరి, వార్డు కౌన్సిలర్ బోర్రా అనిల్ కుమార్, మండల అధ్యక్షుడు బిల్లం శ్యామ్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బై రామ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ ప్రసిడెంట్ భాను, సతీష్,శ్రీకాంత్, ఊరా నరేష్, బైరామ్ రెడ్డి, బైరామ్ రమేష్, కుందేన రాములు, కుందేన ఎల్లం, బైరామ్ సిద్దిరాములు, ఒద్ది స్వామి, బైరమ్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట పట్టణాన్ని రెవెన్యూ డివిజన్‌గా చేయాలి

రామాయంపేట, ఆగస్టు 1, ప్రభాతవార్త: రామాయంపేట పట్టణాన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని చేస్తున్న రిలే నిరాహారదీక్షలు మంగళవారానికి 128వ రోజులకు చేరకున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ నిన్నగాక మొన్న ఏర్పడిన బిబిపేట మండలంలో జూనియర్ ఇంటర్మిడియేట్ కాలేజిని సాధించుకుంటే, రామాయంపేటలో ఇంటర్మిడియేకాలేజ్ పెట్టి 42 సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పటికి ఇప్పటివరకు డిగ్రి కాలేజ్ లేదని, పాలిటెక్నిక్ కాలేజ్ లేదన్నారు. విద్యావ్యవస్థలో ఏ విధంగాను ముందడుగు వేయలేదన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం సమస్యలను గుర్తించి ఒక్కొక్కటిగా పరిష్కరించే ఆలోచనలో ఉంటే మెదక్ ఎమ్మెల్యే గతంలో 183 రోజుల ఉద్యమం జరిగినప్పటికి, ప్రస్తుతం 128వ రోజు ఉద్యమం జరుగుతున్నప్పటికి ఇక్కడి ప్రధాన సమస్య రెవెన్యూ డివిజన్‌పైన ఇప్పటివరకు ఎమ్మెల్యే స్పందించకపోవడం బాధకరమన్నారు. ఇప్పటికైన రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఉడకనంటున్న కూరగా'యా'లు

-పైపై కి టమాట ధరలు
-కోడి కూరకు
సరి తూగుతున్న టమాట

వికారాబాద్,ఆగష్టు 01, ప్రభాతవార్త:
ఏం కొనేటట్లు లేం..ఏమి తినేటట్లు లేం అనే సీని గేయాన్ని తలపిస్తున్నాయి ప్రస్తుత కూరగాయల ధరలు. పెరిగిన కూరగాయల ధరల కారణంగా పప్పు చారే నయం అనే విధంగా సామాన్య, మద్యతరగతి వారి పరిస్థితి నెలకొంది. రోజులు గడిచిన ఇంట్లో కాయగూరల వాసన రావటం లేదని నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల్లోని చిన్నారులు వంటింటి వైపు ఆశగా ఎదురు చూడాల్సి వస్తుంది. టమాట కూర గురించి చెప్పక్కర్లేదు. నెల రోజులు గడుస్తున్న సామాన్యుల ఇంటి వైపు టామాట విక్రయదారులు రావడం లేదు. కొందరైతే..టమాట కూర బదులుగా కోడి కూర వండుకుని తినేస్తున్నారు. కోడి కూర ధరకు సైతం టమాట సరి తూగడంతో మాంసాహార ప్రియులు కోడికూరనే నయం అని టమాటకు బదులు చికెన్ కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో రోజు చికెన్ ధర కంటే టమాట ధర హెచ్చుగా ఉండటంతో కోడి కూర కు టమాట పోటీ పడుతుంది. కూరగాయల మార్కెట్ రూ.500 తీసుకుని వెళ్తే..కనీసం సగం బ్యాగు నిండా కూరగాయలు రావట్లేదని వినియోగదారులు వాపోతున్నారు. గతంలో రూ.300 ఖర్చు చేస్తే వారానికి సరిపడా కూరగాయలు వచ్చేవని, ప్రస్తుతం రెండింతలు ఖర్చు చేసిన వారానికి సరిపడా కూరగాయలు రావడం లేదని పలువురు గృహిణిలు వాపోతున్నారు.

-రాజును మించిన టమాట...

కూరగాయాల్లో రారాజు గా వంకాయను అభివర్ణిస్తుంటారు. దీంతో పెళ్లి తదితర విందుల్లో శాఖాహార ప్రియుల కోసం తప్పనిసరి వంకాయనే వండుతారు. ప్రస్తుతం వంకాయ ధర కంటే టమాట ధర మూడింతలు పెరగడంతో, విలాసంగా భావించే వారి విందులో టామాట కూర ధర్శనమిస్తుంది. ప్రస్తుతం టమాట ధర ఆకాశన్నంటుతుండటంతో టామాట కూర విందులో ఏర్పాటు చేయడం గొప్పగా భావిస్తున్నారు. ఈ మధ్య జరిగిన పలు విందుల్లో టమాట కూర దర్శనమివ్వడంతో చర్చనీయాంశమవుతుంది. గతంలో ఆదివారం వస్తే చికెన్ తిన్నాము అనే వారు..ప్రస్తుతం టమాట కూర తిన్నాము అనే స్థాయికి టమాట చేరుకుంది. కూరగాయల రారాజు వంకాయ, మాంస ప్రియుల రారాజు కోడి కూర స్థానాన్ని టమాట అదిగమించిందని పలువురు చమత్కరించుకుంటున్నారు.

-మరో మూడు వారాల పాటు ఇదే ధరలు కొనసాగవచ్చు
ః వెంకట్‌రెడ్డి, ఏఎంసీ సెక్రటరీ

కూరగాయల ధరలు పెరగడానికి ముఖ్య కారణం వినియోగదారుల అవసరాలకు తగ్గట్లుగా రైతులు కూరగాయలు పండించకపోవడమే. గతంలో సరైన ధర రాకపోవడంతో టమాటలను బజార్లలో పారవేసి పోయిన ఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం టమాట ధరలు పెరగడంతో రైతులు ఎంతో ఆనందంగా ఉన్నారు. అధిక మొత్తంలో రైతులు టమాట, ఇతర కూరగాయలు పండించి ఉంటే ధరలు సాధారణ స్థాయిలో ఉండేవి. డిమాండ్‌కు తగ్గట్లు ఉత్పత్తి లేకపోవడమే ధరల పెరుగు దలకు కారణం. ఏదిఏమైన రైతుకు సరైన ధర లభించే విధంగా కృషి చేయడమే తమయొక్క ముఖ్య విధి. టమాట రైతులు లాభదాయకంగా ఉండటం తమకు ఎంతో సంతోషాన్నిస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి తెలిపారు.

వికారాబాద్ లోని రైతు బజార్

ప్రస్తుత కూరగాయల ధరలు

టమాట కిలో	-రూ.170	చిక్కుడు కిలో	-రూ.75
వంకాయ కిలో	-రూ.40	గోకర కాయ కిలో	-రూ.55
బెండకాయ కిలో	- రూ.50	బీట్‌రూట్ కిలో	-రూ.45
పచ్చి మిర్చీ కిలో	- రూ.115	క్యాప్సికం కిలో	-రూ.50
కాకర కాయ కిలో	- రూ.55	ఆలుగడ్డ కిలో	-రూ.30
బీరకాయ కిలో	- రూ.60	కీర కిలో	-రూ.30
క్యాబేజీ కిలో	-రూ.25	బుడుమ కాయ కిలో	-రూ.20
బీర్నీస్ కిలో	-రూ.110	సొరకాయ కిలో	-రూ.20
క్యారెట్ కిలో	-రూ.80	ఉల్లిగడ్డ కిలో	-రూ.30
క్యాలిఫ్లవర్ కిలో	-రూ.25	అల్లం కిలో	-రూ.190
దొండకాయ కిలో	-రూ.45	వెల్లుల్లి కిలో	-రూ.140

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : ఎంపిపి రఘుమారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 1, (ప్రభాతవార్త) :
ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారరులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ రఘుమారెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ప్రజా సమస్యలపై ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రఘుమారెడ్డి మాట్లాడుతూ... సమన్వయంతో సమస్యల పరిష్కారానికి అందరం కలిసి కృషి చేద్దామని అన్నారు. రైతులకు నార్లను మహేశ్వరంలోనే అందజేసేటట్లు తగు చర్యలు తీసుకోవాలని దబిల్‌గూడ సర్పంచి బుగ్గని శంకర్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. చిన్న, సన్నకారు రైతులకు పండ్లతోటల పెంపకానికి ధరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ నర్సింహులు సూచించారు. గ్రామ పంచాయతీ పక్కా భవనాలకు రూ.20లక్షలు సరిపోవడం లేదని రూ.1కోటికి పెంచాలని సర్పంచి బుగ్గని శంకర్ అన్నారు మహేశ్వరం హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు సాయంత్రం వేళల్లో బయట తిరుగుతున్నారని దానిని అరికట్టాలని కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అదిల్ అలీ సూచించారు. హాస్టలలో చదివే విద్యార్థులకు బెడ్‌షీట్లు, పిల్లోలను సమకూర్చాలని కేసీతాండ సర్పంచి మోతిలాల్‌నాయక్ అన్నారు. అర్హులైన వారందరికి సహకార బ్యాంకులలో రాజకీయాలకు అతీతంగా లోన్లను అందజేయాలని మాణిక్యమ్మ గూడ సర్పంచి చంద్రయ్యగౌడ్ అన్నారు. దళిత బంధు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి ప్రాధాన్యతను ఇవ్వాలని సర్పంచులు చంద్రయ్యగౌడ్, శంకర్, రాఘవేందర్‌గౌడ్, మనోహర్, సురేష్ అన్నారు. సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన పనులను అధికారులు యుద్ధ ప్రతిపాదికన పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునితా ఆంధ్యానాయక్, సహాకార బ్యాంకు చైర్మన్ మంచె పాండుయాదవ్, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీఓ నర్సింహులు, డీఎల్‌పీఓ అమృత, ఎంఈఓ కృష్ణయ్య, ఎంపీఓ రవీందర్ రెడ్డి, ఏఈలు సుధాకర్‌రెడ్డి, చక్రపాణి, ఆర్ అండ్ బి డీఈ సరిత, మండల వ్యవసాయ అదికారి నాగమణి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

. సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, తదితరులు

మున్సిపాలిటీల అభివృద్ధికి ముఖ్యమంత్రి కెసిఆర్ కృషి

పరిగి ఆగస్టు 1,ప్రభాతవార్త :
బిఆర్ఎస్ ప్రభుత్వంలో మున్సిపాలిటీల అభివృద్ధికి ముఖ్యమంత్రి కెసిఆర్ ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పరిగి మున్సిపాలిటీలో పండుగలా బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిగి పట్టణ కేంద్రంలోని 11,12,15 వ వార్డులలో మున్సిపాలిటీ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే మహేష్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు వార్డులలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. బస్తీలలో పర్యటిస్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకుని వెంటనే సంబధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....అవసరం ఉన్న చోట నూతన మంచినీటి ట్యాంక్‌లను, నూతన బోర్‌లు, పైపుల్, అండర్ డ్రైనేజీ వ్యవస్థ, సిసి రోడ్డు ,విధి దీపాలను నిర్మాణం చేపడతామని అన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువచ్చిన పరిష్కరిస్తామని తెలియజేశారు. అనంతరం ఆయా వార్డుల మహిళలు నాయకులు పూలమాల శాలువాలతో ఎమ్మెల్యే మహేష్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, పిఎసిఎస్ చైర్మన్ శ్యామ్ సుందర్ రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సినియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి ,కౌన్సిలర్లు ఎదిరే కృష్ణ, మునీర్, వెంకటేష్, రవీంద్ర, నాగేశ్వర్, రవి కుమార్, మౌలానా, పట్టణ అధ్యక్షుడు మంగు సంతోష్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ భాస్కర్ ,మహిళా అధ్యక్షుడు లక్ష్మి, కమిషన్ శ్రీనివాసన్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, కాలని వాసులు పాల్గొన్నారు.

పోలీసులు ప్రజలతో కలిసిమెలిసి ఉండాలి : జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

కుల్కచర్ల ఆగస్టు 1ప్రభాతవార్త :
పోలీసులు ప్రజలతో కలిసిమెలిసి ఉండాలని వికారాబాద్ జిల్లా ఎస్పీన్ కోటిరెడ్డి డిఎస్‌పి కరుణాసాగర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వార్షిక తనిఖీలో బాగంగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెండింగ్‌లో ఉంచరాదని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. మొత్తం అన్ని విభాగాలలోనూ కుల్కచర్ల పోలీస్ స్టేషన్ అధికారుల పనితీరు బాగుందని కొనియాడారు. ఇదే తరహాలో ఇక ముందు కూడా పనితీరును కొనసాగిస్తూ మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. అధికారులు ఉన్నతాదికారుల సూచనలను తూచా తప్పకుండా పాటిస్తూ ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని కొన్ని కఠిన సమయాల్లో ప్రజలకు సహకారాలు అందిస్తూ రక్షించేందుకు పోలీసులు ముందు వరుసలో ఉండాలని తెలిపారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ముఖ్యంగా కుల్కచర్ల మండల పరిదిలో గ్రామీణ ప్రాంతిలు ఎక్కువగా ఉన్నందున నేరాలు, ఆత్మహత్యలు, రోడ్డు ఆక్సిడెంట్లు రోడ్డు రవాణా, విద్య తదితర విషయాలపై అవగాహన పెంపోందించాలని తెలిపారు. వాహనదారులు ప్రయాణ సమయంలో హెల్మెట్లు, సీటు బెల్టులు ధరించి ట్రాఫిక్ నియమాలను పాటించేలా అవగాహన పెంచాలని పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఫిర్యాదు అందిన వెంటనే పోలీస్ అధికారులు స్పదించాలని ముఖ్యమైన కఠినమైన ఫిర్యాదులు అందితే వెంటనే ఉన్నతాదికారులకు సమాచారం ఇవ్వాలని 5ఎస్ ఫంక్షన్ వెర్టికల్ పైన ప్రత్యేక దృష్టి పెట్టి ఎల్లప్పుడూ సమాజంలో పోలీస్ డిపార్ట్‌మెంట్లో వస్తున్న మార్పులను గ్రహిస్తూ ఆ విధంగా విధులు నిర్వహించాలని ఫ్రెండ్లీ పోలీసింగ్, కమ్యూనిటి పోలీసింగ్ గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. సిసిటివి ఉపయోగాలు వాటివల్ల చేదించిన కేసుల గురించి ప్రజలకు తెలియజేసి ప్రతి గ్రామంలోనూ ప్రజలే స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకునే విదంగా కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. స్టేషన్ పరిదిలో ఉన్న రౌడీలు, సస్పెక్ట్స్ పైన ప్రత్యేక నిఘా పెట్టాలని పోలీసులు ప్రజలతో కలిసిమెలిసి ఉంటూ మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పోలీస్ సిబ్బంది యొక్క టర్నౌట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పరిగి సిఐ వెంకట్రామయ్య, ఎస్ఐ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పి కోటిరెడ్డి, డిఎస్పి కరుణాసాగర్‌రెడ్డి,

వైభవంగా శీతల పండుగ

సంప్రదాయ వేషధారణలో గిరిజన కుటుంబం

ఆమనగల్లు ఆగస్టు1,ప్రభాతవార్త : ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి తండాలో మంగళవారం గిరిజన సంప్రదాయ బద్ధంగా కుటుంబ సభ్యుల గిరిజనం శీతల వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. కులదైవానికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం తండాలో భారీ ఊరేగింపు నిర్వహించి సందడి చేశారు. ఊరేగింపును తిలకించడానికి ప్రజలు పెద్దఎత్తున తండాకు చేరుకున్నారు.

పేద విద్యార్థులకు తనవంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుంది

కీసర, ఆగస్టు4, ప్రభాతవార్తః
పేద విద్యార్థులకు తనవంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని నాగారం మున్సిపల్ 15 వార్డు కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం సత్యనారాయణ కాలనీలో నివాసం ఉండే కార్తీక్ ఎంబిబిఎస్ ఆర్థిక స్థోమత లేక పుస్తకాలు కొనుగోలు చేయడానికి తనవంతు సహయంగా 12 వేల రూపాయలు ఇవ్వడం జరిగింది. తరువాత తన చదువుకు సహయ సహకారాలు ఉంటాయని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

పేద విద్యార్థి కార్తీక్‌కి 12 వేల రూపాయల ఆర్థిక సహాయం చేస్తున్న 15 వార్డు కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి

మృతుడి కుటుంబానికి పరామర్శ

జగదేవ్‌పూర్, ఆగస్టు 1 (ప్రభాతవార్త): మండల కేంద్రానికి చెందిన వార్డు మాజీ సభ్యుడు దోమ జహంగీర్ సోమవారం అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సా రెడ్డి మృతుని కుటుంబసభ్యులను మంగళవారం పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుని కుటుంబసభ్యులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అమర రాము, శాషబాయ్, అజీజ్, మచ్చ బాబు, అబ్బు తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రికి దీటుగా ప్రభుత్వ ఆసుపత్రి

దుబ్బాక, ఆగస్టు 1, ప్రభాతవార్త: సిఎం కేసీఆర్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు నాయకత్వంలో దుబ్బాక పట్టణ కేంద్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించబడిన వంద పడకల ఆసుపత్రికి పూర్తిస్థాయిలో అందుబాటులో తేవడానికి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి విశేష కృషిచేసి 71 పోస్టులు మంజూరు చేయడం జరిగింది. మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి, ఎండీ ఖాలీల్ వారు సీఎం కేసీఆర్, మంత్రి హరీష్, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి చిత్ర పట్టనికి పాలభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో పాలనలో దుబ్బాక మండలంలో 100 పడకల ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ కూడ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో దుబ్బాక ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్ళి చాలా ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు కేసీఆర్ పాలనలో ప్రైవేట్ ఆసుపత్రికి ధీటుగా అన్ని రకాల వైద్య సేవలతో దుబ్బాక లో వంద పడకల ఆసుపత్రిలో మెరుగైన వైద్య అందుతుందన్నారు. దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి 71 పోస్టులు మంజూరు చేయడం జరిగింది అన్నారు. దుబ్బాక పరిసర ప్రాంత ప్రజలకు ఒక్క గోప్ప వరంమన్నారు. ఈ కార్యాక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, ఎంపీపీ కొత్తపుష్పలత కిషన్ రెడ్డి, కౌన్సిలర్ బంగారయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి ఖలీల్, రొట్టె రాములు పంతులు, ఆశ యాదగిరి, శ్రీను, సదక్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన

సిద్దిపేట రూరల్, ఆగస్టు 1, ప్రభాతవార్త : సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని తోర్నాల గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం చిన్నగుండవెల్లి అయూష్‌శాఖ అధ్వర్యంలో వర్షా కాలం సీజనల్ వ్యాధులు సోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయూష్ వైద్యులు ఉమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొంటూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోషకాహారం తీసుకొని వ్యాధినిరోధక శక్తిని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అయూష్ అరోగ్య దీపకలను అందించారు. కార్యక్రమంలో పార్మసిస్టు రచ్చ రమేష్, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అయూష్ అరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థులకు ల్యాప్ ట్యాబ్‌ల పంపిణీకి సిద్ధం

సిద్దిపేట రూరల్, ఆగస్టు 1, ప్రభాతవార్త : రాష్ట్ర అర్థిక, అరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు చొరవతో వెయ్యి మంది గురుకుల పాఠశాలల విద్యార్థులకు ల్యాప్ టా యబ్‌లు పంపిణీ చేయనున్నారు. జిల్లాలోని ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక సాఫ్ట్ వేర్, కోచింగ్ మెటీరియల్‌తో కూడిన ట్యాబ్ లెట్లను పంపిణీ చేస్తానని మంత్రి ఇచ్చిన హామీనీ త్వరలోనే నెరవేర్చబోతున్నారు. సిద్దిపేట జిల్లాలోని మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ గురుకుల బాలికల స్కూల్, జగదేవాపూర్, చింతమడక, శేరపల్లి బందారం, హుస్నాబాద్‌లతో ప్రథమ, ద్వితీయ ఇంటర్ చదివే 396 మంది విద్యార్థులకు పంపిణీ చేయడానికి సిద్ధం చేశారు. మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ గురుకుల బాలుర పాఠశాల గొల్లపల్లి, నారాయణరావుపేట, దౌల్తాబాద్‌లలో ప్రథమ, ద్వితీయ ఇంటర్ చదివే 288 మంది విద్యార్థులకు టా యబ్‌లు పంపిణీ చేయనున్నారు. సిద్దిపేట రూరల్‌లో 160 మంది, మిట్టపల్లి గురుకుల కళాశాలలో 160 మంది ఇంటర్ విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయడం జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా వెయ్యి మందికి ల్యాప్ ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నారు. విద్యాభివృద్ధికి, ప్రతి సబ్జెక్టుపై అవగాహన పెంచుకునేందుకు ఎంతోగానే ఉపకరించనున్నాయి. ఐఐటీ, ఎంసెట్, నీట్‌కు, సీయూసెట్‌లో మెరుగైన ఫలితాల సాధనకు తోడ్పడుతాయన్నాయని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ తెలిపారు.

బండి సంజయ్‌ని అభినందించిన బుక్క వేణుగోపాల్

శంషాబాద్ ఆగస్టు1, ప్రభాతవార్త :
బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు రాష్ట్ర బిజెపి మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్‌ను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్ సన్మానించారు. బండి సంజయ్ కుమార్‌ను బిజెపి అధిష్టానం వర్గం ఇటివల జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. కాగా మంగళవారం ఉదయం బుక్క వేణుగోపాల్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లి బండి సంజయ్ కుమార్‌ను శాలువా పూల మాలతో సన్మానించారు. సమర్థవంతమైన నాయకుడు సంజయ్ కుమార్ నేతృత్వంలో తెలంగాణలో బిజెపికి తిరుగులేని విధంగా పటిష్టమైందని బుక్క వేణుగోపాల్ తెలిపారు. జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో దేశవ్యాప్తంగా పార్టీని పటిష్టం చేయడం కోసం ఆయన సేవలు వినియోగించుకోవాలని అధిష్టానం నిర్ణయించడం అభినందనీయమని అన్నారు.

వర్షాలతో దెబ్బతిన్న పంటల పరిశీలిన

దౌల్తాబాద్, ఆగస్టు 1 ప్రభాతవార్తః
ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ పరిశీలించారు. మంగళవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని మాటూర్ గ్రామంలో పర్యటించిన ఆయన రైతుల పంట పొలాలను సందర్శించారు. పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు రైతులకు సలహాలు, సూచనలు చేశారు. పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించాలని, పత్తి పొలాల్లో భాస్వరం, నత్రజని, పొటాష్ ఎరువులను 3 సమాన భాగాలుగా 30, 60, 90 రోజులకు ఒకసారి వేయాలన్నారు. మొక్కలకు 7 నుంచి 10 సెంటి మీటర్ల దూరంలో ఎరువులు వేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు శ్రీపతిరెడ్డి, మదరప్ప తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

కీసర, ఆగస్టు1, ప్రభాతవార్తః
బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే గ్రామాలు అన్ని అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం గోధుమకుంట గ్రామంలోని టిపిఎస్ క్రిష్ణనగర్ కాలనీ ఫేస్ 3లో జాతీయ జెండా నుండి రాజు ఇంటి వరకు మంత్రి తన సొంత నిధులతో సీసీ రోడ్డు వేయుటకు హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం కాలనీలో తిరుగుతూ ప్రజలకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో లేవన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం అధిక మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సోమని ఆంజనేయులు, ఎంపిటిసి మంచాల కిరణ్‌జ్యోతి ప్రవీణ్‌కుమార్, వార్డు సభ్యులు పుట్ట బాలరాజుగౌడ్, చీర శేఖర్, చీర రజిత శ్రీ మహేష్, సామల ప్రేమ్‌రాధ్‌రెడ్డి, తాండూరి సంధ్య దశరథగౌడ్, నాచారం పద్మ, మంచాల స్వరూప పెంటయ్య, జంగం శివలింగం తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్‌ని కలిసిన నాగారం చైర్మన్

కీసర, ఆగస్టు1, ప్రభాతవార్తః
మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం చైర్మ న్ మాట్లాడుతూ నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి డిఆర్‌సి సెంటర్ యొక్క ల్యాండ్, మైనార్టీ ల్యాండ్ గురించి అడగడం జరిగిందన్నారు. వెంటనే స్పం దించిన అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ ల్యాండ్ డిపార్ట్‌మెంట్‌కు ఫార్వర్డ్ చేయించా రని తెలిపారు. అనంతరం రెవెన్యూ అన్ లా ఇంఛార్జీ చంద్రవతిని కలవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి

కీసర, ఆగస్టు1, ప్రభాతవార్తః
వర్షాకాలంలో విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని మండల వైద్యాధి కారి సరిత సూచించారు. మంగళవారం బోగారంలోని వివేకానంద కాలేజీ, బాలుల గురుకుల పాఠశాలలో గ్రామాలలోని గురుకుల పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ విద్యార్థులకు కం క్ట్వైటీస్ ఒకరి నుండి ఒకరికి వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురిం చి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ ప్రతాప్, సూపర్‌వైజర్ చండీదేవి, ఏఎన్ఎం ఇందిర, ఆశ కార్యకర్తలు వినోద, పుష్పలత తదితరులు పాలొన్నారు.

మాట్లాడుతున్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి హరికృష్ణ

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

టిపిసిసి ప్రధాన కార్యదర్శి హరికృష్ణ

సిద్దిపేట రూరల్, ఆగస్టు 1, ప్రభాతవార్త : వరద బాధితులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని టిపిసిసి ప్రధాన కార్యదర్శి పూజల హరికృష్ణ మండిపడ్డారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ, 10 రోజులు కురిసిన భారీ వర్షాలతో వరదలు వచ్చి రాష్ట్రం అతలాకుతలం అయిందని, దీంతో దాదాపు 60 మంది మృతి చెందారన్నారు. వరదలతో ప్రజలకు పెద్దమొత్తంలో నష్టం జరిగిందన్నారు. పొలాలు మునిగి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వరదలతో నష్టపోయిన ప్రజలను, రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సహాయక చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కలిమొద్దీన్, గౌటి బాబేష్, గోపికృష్ణ, మైపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వహాబ్, బండి శివకుమార్, బబ్లు, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసి కార్మికుల సంబరాలు

స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకుంటున్న ఆర్టీసి కార్మికులు

సిద్దిపేట రూరల్, ఆగస్టు 1, ప్రభాతవార్త : ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంతో హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం కార్మికులు సంబరాలు జరుపుకున్నారు. సిఎం కెసిఆర్, మంత్రులు కెటిఆర్, హరీష్‌రావుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసి యూనియన్ గౌరవాధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ కడవెర్గు రాజనర్సు మాట్లాడుతూ ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల 43,373 మంది కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందుతారన్నారు. సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సిఎం కెసిఆర్ నాయకత్వంలో మూడోసారి బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చితీరుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించబడిన ఆర్టీసి కార్మికులు బిఆర్ఎస్‌కు అండగా నిలువాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు నాయకం లక్ష్మన్, అరవిందరెడ్డి, నాగరాజురెడ్డి, కో-అప్షన్ సభ్యులు మేర సత్తయ్య, బిఆర్ఎస్ నాయకులు గూడాల శ్రీకాంత్‌గౌడ్, ఆర్టీసి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు ప్రతి ఒక్కరూ తరలిరావాలి

కడవెర్గులో జేపిసి కమిటీని నిర్వహిస్తున్న దృశ్యం

చేర్యాల, ఆగస్టు 1, ప్రభాతవార్త : ఈ నెల 4వ తేదీన చేర్యాల రెవెన్యూ డివిజన్‌కు సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని జేపిసి మండల కన్వీనర్ బొమ్మగోని అంజయ్యగౌడ్ పిలుపు నిచ్చారు. మంగళవారం కడవేర్గు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అంజయ్యగౌడ్ పాల్గొని మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన చేర్యాల నుండి సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించడం జరుగుతుందని, అందుకు కుల,మత, రాజకీయ బేధాలు లేకుండా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కత్తుల భాస్కర్‌రెడ్డి, వడ్లూరి నారాయణ, ఆరుట్ల వినీత్ పాల్గొన్నారు.

జేపిసి కడవెర్గు గ్రామ కమిటీ ఎన్నిక...

గ్రామ కన్వీనర్‌గా మడికొండ బాపురాజు, కో-కన్వీనర్లుగా మర్యాల సత్తయ్య, చల్ల బాల్‌రెడ్డి, పిట్టల సురేష్, కార్యదర్శి కొమ్ము లచ్చయ్య, సహాయ కార్యదర్శి జల్లినాగరాజు, కోశాధికారిగా పానుగంటి శ్రీనివాస్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పోతిరెడ్డిపల్లిలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలి

చేర్యాల, ఆగస్టు 1, ప్రభాతవార్త : మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని సిపిఐ మండల కమిటీ సభ్యులు కత్తుల భాస్కర్‌రెడ్డి తహసీల్దార్ ఆరీఫాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ యువకులకు, మహిళలను పౌరుని యొక్క బాధ్యతలు, విధుల పట్ల అవగాహన ఈ కార్యక్రమం ద్వారా తెలుస్తుందన్నారు. అందుకు తహశీల్దారు సానుకూలంగా స్పందిస్తూ ఈనెల 30న గ్రామంలో ఏర్పాటు చేస్తామని తెలిపినట్లు ఆయన తెలిపారు.

సిపిని కలిసిన మర్కుక్ నూతన ఎస్ఐ

సిపి శ్వేతకు పూల మొక్కను అందజేస్తున్న మర్కుక్ ఎస్ఐ శంకర్

మర్కుక్, ఆగస్టు 1 (ప్రభాతవార్త): మర్కుక్ నూతన ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శంకర్ మంగళవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేతను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శంకర్ మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతల పరిరక్షణకై కృషి చేస్తానన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజల సహాయ సహకారాలతో మండలాన్ని నేరరహిత మండలంగా తీర్చిదిద్దడానికి తనవంతు ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు.

చేబర్తిలో పర్యటించిన ఎమ్మెల్సీ యాదవరెడ్డి

మర్కుక్, ఆగస్టు 1 (ప్రభాతవార్త): మండలంలోని చేబర్తి గ్రామంలో మంగళవారం ఎమ్మెల్సీ యాదవరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ భవనంలో నిర్వహిస్తున్న హెల్త్ సెంటర్‌ను సందర్శించి వేరొక భవనంలోకి మార్చి అంగన్‌వాడీ నిర్వహణకు ఇబ్బంది లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జెడ్‌పిటిసి మంగమ్మరాంచంద్రం, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ అశోక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాందాస్‌గౌడ్, ప్రవీణ్‌చారి, ఆత్మ కమిటీ డైరెక్టర్ సంతోష్‌రెడ్డిలు ఉన్నారు.

హెల్త్ సెంటర్ వైద్యాధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

ప్రైవేట్‌కు దీటుగా సర్కార్ బడుల అభివృద్ధి

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

చేబర్తిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ

మర్కుక్, ఆగస్టు 1 (ప్రభాతవార్త): మన ఊరు మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు పలు మౌలిక వసతులతో ప్రైవేట్‌కు ధీటుగా అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి తెలిపారు. మండలంలోని చేబర్తి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వంటిమామిడి మార్కెట్ డైరెక్టర్ రాందాస్‌గౌడ్ సహకారంతో 1, 2 తరగతుల విద్యార్థులకు ఇంగ్లీష్ పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్సీ హాజరై స్థానిక జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ అశోక్‌తో కలిసి విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా ఇంగ్లీష్ పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేయడం అభినందనీయమని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఎంతో అభివృద్ధి సాధిస్తున్నాయని తెలిపారు. మన ఊరు మన బడి ద్వారా 12 మౌలిక వసతులతో సన్న బియ్యంతో భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల దుస్తులను, పాఠశాల అభివృద్ధి కోసం కెసిఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రైవేట్ పాఠశాలలు వద్దు ప్రభుత్వ పాఠశాలలే ముద్దు అనే విధంగా తల్లిదండ్రులు తెలుసుకొని విద్యార్థులను సర్కార్ బడులలోనే చదివించే విధంగా ఉపాధ్యాయ బృందం ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేయాలని, ప్రైవేట్ బడులలో నాణ్యమైన విద్యాబోధన ఉండదని, ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన ఉంటుందని, సకల సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. అనంతరం దాత రాందాస్‌గౌడ్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందిస్తూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వామి, ఆత్మ కమిటీ డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, వంటిమామిడి డైరెక్టర్ ప్రవీణ్‌చారి, వార్డు సభ్యులు జైరామ్, బాలకృష్ణ, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గ్యార మల్లేశం, నాయకులు తోట సత్తయ్య, కనకయ్య, బాలకృష్ణ, బాబు, కరుణాకర్, నవీన్, నరేష్, ప్రధానోపాధ్యాయుడు నర్సింలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెవులు మూసుకొని నిరసన తెలుపుతున్న కార్మికులు

27వ రోజులకు చేరుకున్న నిరవధిక సమ్మె

కొండపాక, ఆగస్టు 1, ప్రభాతవార్త : పంచాయతీ కార్మికులు సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారినికి 27వ రోజులకు చేరుకుంది.కార్మికులు చెవులు మూసుకొని నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి అమ్ముల బాల్‌నర్సయ్య, అక్షణ్ మాట్లాడుతూ ప్రభుత్వం నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరించకుండా తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం పట్టిచుకోకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అరుట్ల నర్సింలు, భోగి సాయి కుమార్, కొమ్ము అంజనేయులు, తాటోజు మల్లేశం, పోట్యోల్ల నరహరి, దబ్బెట ముత్తయ్య, పంజా శ్రీనివాస్, నీరటి కలవ్వ, తలపాక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణకు ఎమ్మెల్సీ ఇవ్వడం పట్ల హర్షం

మిఠాయిలు తినిపించుకుంటున్న ఎరుకల సంఘం నాయకులు

గజ్వేల్ టౌన్, ఆగస్టు 1 (ప్రభాతవార్త): గవర్నర్ కోటాలో సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే కుర్ర సత్యనారాయణకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడం పట్ల గజ్వేల్ ఏకలవ్య ఎరుకల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎరుకల సంఘానికి చెందిన సత్యనారాయణకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇచ్చినందుకు సిఎం కెసిఆర్, మంత్రులు హరీష్‌రావు, కెటిఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ కూరాకుల శ్రీనివాస్, గజ్వేల్ ఏఎంసి డైరెక్టర్ చిలసారం ప్రవీణ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటసాయి, సహకార సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, కూరాకుల మల్లేశం, చిలసారం మల్లేశం, రమేష్, నర్సింలు, మహేందర్, వాల్మీకి, కుతాడి మధు, వెంకటేష్ పాల్గొన్నారు.

సిఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావు చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

నంగునూర్, ఆగస్టు 1, ప్రభాతవార్త : సిఎం కెసిఆర్ టేకేదారులకు రూ. 2016 పెన్షన్ ఇస్తామని ప్రకటించడంతో మంగళవారం మండల పరిధిలోని రాజగోపాల్‌పేట గ్రామంలోని బీడీ కార్ఖానావద్ద సిఎం కెసిఆర్, మంత్రి హరీష్ రావు చిత్ర పటాలకు టేకేదార్లు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టేకేదారులు సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వానికి తండాలపై చిన్నచూపు తగదు

టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్, ఆగస్టు 1 ప్రభాతవార్త: బిఆర్ఎస్ ప్రభుత్వానికి తండాలపై చిన్న చూపు తగదని టిపిసిసి ప్రదానకార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్ మండలం పిల్లిగుండ్ల తండా గ్రామ పంచాయతీలోని మధిర తండా అయినా జువ్వి పోచమ్మ తండాను ఆయన పరిశీలించారు. అంతేగాక నర్సాపూర్ పట్టణంలో ఆవుల రాజిరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు బాధిత కుటంబాలకు ఆయన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈమేరకు నర్సాపూర్ పట్టణానికి చెందిన హైమద్ ఇటీవల అనారోగ్య కారణాల వల్ల మృతి చెందగా వారి కుటంబాన్ని పరామర్శించి ఆ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని ఆందించారు. అంతేగాక నర్సాపూర్ పట్టణంలో ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణానికి చెం దిన మహ్మద్ నజీర్, బిపాషాకు చెందిన ఇండ్లు ధ్వంసమైంది. దీంతో ఆ కుటుటంభాలకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ మండలంలోని పిల్లిగుండ్ల తండా గ్రామ పంచాయతీ పరిదిలోని మధిర తండా అయిన జువ్వి పోచమ్మ తండాకు ఇప్పటి వరకు రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం పట్ల ప్రభుత్వం పై ఆయన మండిపడ్డారు. తండాలను అభివృద్ధి చేస్తున్నామని ప్రకటించుకుంటున్న బిఆర్ఎస్ ప్రభుత్వం ఇదేనా తండాల అభివృద్ధి అని ప్రశ్నించారు. ఈ గ్రామాన్ని ఎమ్మెల్యే దత్తత తీసుకోగా ఈ తండాకు రోడ్డు సౌకర్యం లేకపోవడం పై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తండాలపై చిన్నచూపు తగదని ప్రభుత్వం పై ఆయన మండిపడ్డారు.రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ తండాలను అన్ని విదాలుగా అభివృద్ధిని చేసుకుందామని టిపిసిసి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలోపిసిసి మైనార్టీ సెల్ కార్యదర్శి హకీం, నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షులు రియాజ్ అలీ, ఉమ్మడి జిల్లా పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ శ్రీశైలంయాదవ్, నాయకులు రాధాకృష్ణాగౌడ్, దుర్గేశ్ మల్లేష్, శ్రీపతి, కౌడిపల్లి యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు ధన్‌సింగ్,మాజీ ఉప సర్పంచ్ ఫకీర్ నాయక్, చంద్రునాయక్, అల్తాఫ్, మహేందర్,మన్యానాయక్, వెంకటేశ్‌నాయక్, భీమ్లానాయక్, రతన్, బిక్షపతి, రాంసింగ్, పుల్యా, చక్రి, శంకర్ పాల్గొన్నారు.


బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఆవుల రాజిరెడ్డి

ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం చేయూత : ఎమ్మెల్యే

జహీరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త : ఆయిల్ ఫామ్ సాగుతో రైతులు ఆర్థికంగా స్థిరపడతారిని, అందుకు పంట సాగుకు ప్రభుత్వం చేయుత అందిస్తోందని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలంలోని గొట్టిగార్‌పల్లిలో రైతు నారాయణ సాగు చేస్తున్న ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ మహోత్సవంలో ఉద్యాన శాఖ ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గొద్రెజ్ ఆగ్రో వేట్ లిమిటెడ్ సంయుక్తంగా సంగారెడ్డి జిల్లాలో 5వేల 3 వందల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు చేసేలా రైతులను ప్రోత్సాహిస్తోందన్నారు. 4 సంవత్సరాల పాటు సాగు ప్రోత్సాహకంతో పాటు రాయితీపై బిందు సేద్యం పరికరాలను ప్రభుత్వం అందించనుందన్నారు. పండిన పంటకు నిర్దేశించిన ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఆయల్ ఫామ్ సాగువైపు దృష్టి సారిందచాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు అదనపు కలెక్టర్ ఆయిల్ ఫామ్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఆత్మ కమిటి చైర్మన్ పెంటారెడ్డి, ఇప్పెపల్లి సొసైటీ చైర్మన్ మచ్చేందర్, మాజీ మండల అధ్యక్షులు నారాయణ, తిమోతి, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

సిఎం కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, ఆర్టీసి కార్మికులు

జహీరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తామని సోమవారం క్యాబినెట్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రకటించడంతో కార్మికుల్లో ఆనందానికి అవదులు లేకుండా పోయియి. ముఖ్యమంత్రి కేసిఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం పట్టణంలోని ఆర్‌టిసి డిపోలో ఆర్టీసి కార్మికులతో కలిసి ఎమ్మెల్యే సిఎం కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు చేయని సాహసాలు కేసిఆర్ చేస్తూ అందరి సంక్షేమానికి పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జి వెంకట సూర్యనారాయణ, ఆత్మకమిటి చైర్మన్ పెంటారెడ్డి, పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు సయ్యద్ మోహియొద్దిన్, నాయకులు గుండప్ప, మచ్చందర్, ముత్యాల చందు, అరుణ్‌కుమార్, ఆర్టీసి కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

-గజ్వేల్ ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్

మాట్లాడుతున్న మాదాసు శ్రీనివాస్

గజ్వేల్ టౌన్, ఆగస్టు 1 (ప్రభాతవార్త): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ప్రజా రవాణా వ్యవస్థ మరింత బలోపేతం కానుందని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో విలేకరులతో మాట్లాడుతూ కేబినెట్ సమావేశంలో ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయడం, అనాథలను ఆదుకోవడం వంటి నిర్ణయాలతో మరోసారి సిఎం కెసిఆర్ పేదల పక్షపాతిగా నిరూపించుకున్నారన్నారు. భారీ వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని, ప్రజానీకాన్ని ఆదుకునేందుకు తక్షణ సహాయం కింద రూ.500 కోట్లు మంజూరు చేసూ కేబినెట్ నిర్ణయం తీసుకోవడం వరద బాధితులకు ఎంతో ధైర్యం ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అహ్మద్, ఆత్మ కమిటీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ శివకుమార్, గాలెంక శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజగోపాల్‌పేట ఎస్ఐగా మోహన్‌రెడ్డి

నంగునూర్, అగస్టు 1, ప్రభాతవార్త : రాజగోపాల్‌పేట ఎస్ఐగా మోహన్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ పని చేసిన ఎస్ఐ బదిలీపై వెళ్లడంతో మెదక్ రూరల్ ఎస్ఐగా పని చేసి మోహన్‌రెడ్డి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన రాజుగౌడ్ కరీంనగర్ కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లారు.

ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్రపటానికి క్షీఅరాభిషేకం

నర్సాపూర్, ఆగస్టు 1, ప్రభాతవార్త: ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందుకుగాను మంగళవారం నర్సాపూర్‌లోని ఆర్టీసి డిపో నందు ఆర్టీసి ఉద్యోగులు రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్రపటానికి పాలాబిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసి ఉద్యోగులు మాట్లాడుతూ గతంలో ఆర్టీసి ఉద్యోగులు ఆర్టీసి కార్పొరేషన్ క్రింద పని చేస్తున్నారని తెలిపారు. అయితే ఎన్నో ఏళ్లుగా మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వేడుకున్న గత ప్రభుత్వాలు గుర్తించలేదన్నారు. కాగా బిఆర్ఎస్ ప్రభుత్వం సిఎం కెసిఆర్ మమ్మల్ని గుర్తించి ఇన్నాళ్ళకు ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని అన్నారు. ఈమేరకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో ఎన్నో ఏళ్ళ కల నిజమైందని వారు అన్నారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్‌కు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్టీసి డిపో ఇంచార్జ్ లక్ష్మణ్, ట్రాఫిక్ ఇంచార్జ్ నరెందర్, గ్యారేజ్ ఇంచార్జ్ శ్యామ్‌సుందర్ గౌడ్, వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్టీసి ఉద్యోగులు

కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కామ్రేడ్ కృష్ణమూర్తి ఆశయ సాధనకు కృషిచేయాలి

సిపిఎం మండల కార్యదర్శి కొంగరి వెంకటమావో

చేర్యాల, ఆగస్టు 1, ప్రభాతవార్త : కామ్రేడ్ కృష్ణమూర్తి 17వ వర్ధంతిని పుర్కరించుకుని మంగళవారం సిపియంకార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి కొంగరి వెంకటమావో మాట్లాడుతూ భూస్వాములకు వ్యతిరేకంగా దున్నే వారికే భూమి, కూలిపెంచాలని వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి వేలాది ఎకరాల భూమిని పేదలకు పంచి, కౌల్దార్ రక్షణ చట్టం ద్వారా కౌలు రైతులకు గిరిజనులకు, లంబాడీలకు సొంత భూమి దక్కే విధంగా పోరాటం చేసిన ఘనత కృష్ణమూర్తి గారిదన్నారు. ఆయన ఆశయ సాధనకోసం ప్రతి ఒక్కరు పోరాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాళ్ళబండి నాగరాజు, పోలోజు శ్రీహరి, గర్నపల్లి చంద్రం, యాదారం బ్రహ్మయ్య, రమ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ ప్రయోగ పరీక్షలు

సిద్దిపేట రూరల్, ఆగస్టు 1, ప్రభాతవార్త : వర్షాల కారణంగా జూలై 20, 21వ తేదీలలో జరగాల్సిన డిగ్రీ ద్వితీయ సంవత్సర నాల్గో సెమిస్టర్ ప్రయోగ పరీక్షలు ఈనెల 3,4,5వ తేదీలలో నిర్వహించడం జరుగుతుందని అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ రీజినల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్ మంగళవారం తెలిపారు. విద్యార్థులు అయా తేదీలలో పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు.

నర్సరీని సందర్శించిన సర్పంచ్, ఏఓ

మర్కుక్‌లో నర్సరీని పరిశీలిస్తున్న సర్పంచ్, ఏఓ

మర్కుక్, ఆగస్టు 1 (ప్రభాతవార్త): మండల కేంద్రంలో మొక్కల పెంపకం కేంద్రం(నర్సరీ)ని మంగళవారం సర్పంచ్ భాస్కర్ ఏఓ నాగేందర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నర్సరీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకులకు సూచించారు. మొక్కలు పెరిగే వరకు ఎరువులతో పాటు అవసరమైతేనే నీటిని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, నర్సరీ నిర్వాహకులు పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి

మర్కుక్, ఆగస్టు 1 (ప్రభాతవార్త): మండల పరిధిలోని గంగాపూర్-యూసుఫ్‌గాన్‌పల్లి గ్రామానికి చెందిన నాచోనియా హిరామన్‌సింగ్ ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం సిఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా మంత్రి హరీష్‌రావు సహకారంతో మంజూరైన రూ.60వేల చెక్కును మంగళవారం లబ్ధిదారునికి స్థానిక ఉపసర్పంచ్ జగదీష్‌సింగ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘువీర్‌సింగ్, రామ్‌సింగ్, పాండుసింగ్, కుశల్‌సింగ్, జైసింగ్, శంకర్‌సింగ్, రామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ అభివృద్ధి ఫలాలకు ఆకర్షితులై బిఆర్ఎస్‌లో చేరికలు

-ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

బిఆర్ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఆగస్టు 1 (ప్రభాతవార్త): రాష్ట్ర ప్రజలకు సిఎం కెసిఆర్ అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి ఫలాలకు ఆకర్షితులై బిఆర్ఎస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయని ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వర్గల్ మండలం సింగాయిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గజ్వేల్ పట్టణంలోని సిఎం మినీ క్యాంపు కార్యాలయంలో ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ప్రతాప్‌రెడ్డి గులాబి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెసిఆర్ పాలన అద్భుతమైన పాలన అని, రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కిందన్నారు. బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో పంచమి కనకయ్య, పంచ మల్లేష్, బాలేష్, రాజలింగం, రాజయ్య, సాయిలు, నర్సింలు, శ్రీను, స్వామి, పోచమట్ల బిక్షపతి, మహిపాల్, మల్లయ్య, యాదగిరి, నాగయ్య, పెద్ద స్వామి, రాములు, మధు, లక్ష్మణ్, కుమార్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి ఉన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం పట్ల హర్షం

గజ్వేల్ టౌన్, ఆగస్టు 1 (ప్రభాతవార్త): రాష్ట్రంలోని ఆర్టీసీని ప్రభుత్వంలోకి తీసుకుంటామని క్యాబినెట్‌లో సిఎం కెసిఆర్ నిర్ణయం తీసుకోవడంతో మంగళవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో కండక్టర్లు, డ్రైవర్లు సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామంటూ కెసిఆర్ తీసుకున్న నిర్ణయం ఒక చరిత్ర అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, స్థానిక కౌన్సిలర్లు మర్కంటి వరలక్ష్మి కనకయ్య, పంబాల అర్చన శివకుమార్, కిషన్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, తలకొక్కుల భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, శివకుమార్, గుంటుకు రాజు, ఆర్టీసీ డిపో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏబివిపి కదన భేరికి తరలిన నాయకులు

నర్సాపూర్, ఆగస్టు 1, ప్రభాతవార్త:

ఏబివిపి కదన భేరికి తరలిన నర్సాపూర్ ఏబివిపి నాయకులు తదితరులు

హైదరాబాద్ బాగ్యనగరంలో మంగళవారం నిర్వహించిన ఏబివిపి కదన భేరి కార్యక్రమానికి నర్సాపూర్ నుండి ఏబివిపి నాయకులు భారీగా తరలి వెళ్ళడం జరిగింది. ఈ మేరకు ఏబివిపి కదన భేరి కార్యక్రమానికి నర్సాపూర్ నుండి సుమారు 12 వందల మంది విద్యార్థులు తరలి వెళ్లడం జరిగిందని ఏబివిపి నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా పలు వాహానాల్లో ఈ విద్యార్థులు వెళ్ళారు. ఈ కార్యక్రమంలోనర్సాపూర్ ఏబివిపి నాయకులతో పాటు వివిద క్షేత్ర ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు హైద్రాబాద్ కు తరలి వెళ్ళారు.

బిఆర్ఎస్‌లో చేరిన పుల్కల్ బుడగజంగం నాయకులు

అభివృద్ధిని చూసే బిఆర్ఎస్‌లో చేరికలు : ఎమ్మెల్యే

జోగిపేట, ఆగస్టు 1, ప్రభాతవార్త: బిఆర్ఎస్ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే చాలామంది ఇతర పార్టీలను వీడి బిఆర్ఎస్‌లో చేరుతున్నారని అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిణ్ అన్నారు. మంగళవారం అందోలు క్యాంపు కార్యాలయంలో పుల్కల్‌కు చెందిన బుడగజంగాలు బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ చేపడుతున్న పలు ప్రజా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై తమ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ముమ్మందు ఈ చేరికలు ఇంకా పెరగనున్నాయని ఆన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పుల్కల్ గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు లోకేష్, ఎంపిటిసి శ్రీనివాస్‌చారి, పిఏసిఎస్ డైరెక్టర్ మహేష్, బాబు, మహ్మద్ అబీక్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

తడ్కల్‌కు బస్సును ప్రారంబించిన ఎమ్మెల్యే

ప్రయాణీకులతో కలిసి బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే

కంగ్టి, ఆగస్టు 1, ప్రభాతవార్త: సంవత్సర కాలంగా ఆర్టీసీ బస్సు కోసం ఎదురు చూస్తున్న కంగ్టి గ్రామ ప్రజల కలను ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి మంగళవారం నెరవేర్చారు. గ్రామానికి నారాయణఖేడ్ డిపో నుంచి ఆర్టీసి బస్సు సౌకర్యాన్ని కల్పిస్తూ మంగళవారం ఆర్టీసి అధికారులతో కలిసి బస్సుకు పూజలు నిర్వహించి ప్రారంభించి బస్సులో ప్రయాణించారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడంతో విద్యార్థులకు, వ్యాపారులకు, రైతులకు, ఉద్యోగులకు సౌకర్యాలు కల్గినట్లు అయింది.

భీమ్రాతండాకు రూ. 1.26 కోట్లతో బిటి రోడ్డుకు శ్రీకారం...

మండలంలోని భీమ్రా తండాకు 1 కోటి 26 లక్షల రూపాయలతో నిర్మించే బిటిరోడ్డు నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి భూమి పూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఆయా కార్యాక్రమాల్లో ఎంపిపి అధ్యక్షులు సంగీత వెంకట్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు గంగారాం, ఆర్‌టిసి డిపో మేనేజర్ మల్లేశయ్య, మార్కెటింగ్ మేనేజరర్ పాండు, సిఐ జి హన్మంత్, సర్పంచ్‌లు బస్వరాజ్, మనోహర్, మాజీ సర్పంచ్ నారాయణ, నాయకులు పాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు పంటలు వివరాలను నమోదు చేసుకోవాలి : ఎవో

పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో లావణ్య

న్యాల్‌కల్, ఆగస్టు 1, ప్రభాతవార్త: రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని ఎవో లావణ్య అన్నారు. మంగళవారం న్యాల్‌కల్‌లో ఏఈఓ నమోదు చేస్తున్న పంటల వివరాలను మండల వ్యవసాయాధికారి ఎన్.లావణ్య పరిశీలించి రైతులు, ఏఈఓలకు పలు సూచనలు చేశారు. పంటల వివరాలను నమోదు చేసుకోని రైతులు వెంటనే నమోదు చేసుకుంటే ఏఈఓలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని ఏఓ లావణ్య మండల రైతులకు సూచించారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి : కార్పొరేటర్

అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, ఆగస్టు 1,ప్రభాతవార్త: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని వార్డు అధికారులకు భారతీనగర్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి సూచించారు. మంగళవారం భారతీనగర్ డివిజన్‌లో వార్డు అధికారులతో సమావేశం అయ్యారు. జూలైలో డ్రైనేజీ, చెట్లు కత్తరించుట, వీధి దీపాల సమస్యలు పరిష్కరించాలని 72 ధరఖాస్తులు రాగా 71 పరిష్కరించినట్లు, ఆన్‌లైన్‌లో వచ్చిన 63 సమస్యలకు 57 పరిష్కరించినట్లు వార్డ్ అడ్మినిస్ట్రేటీవ్ అధికారి రమేష్ సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్బంగా సింధూఆదర్శ్‌రెడ్డి మాట్లా డుతూ ప్రతి నిత్యం వచ్చే సమస్యలను రికార్డులు పరిశీలించి వెంటనే పరిష్కారించాలన్నారు. డివిజన్‌లో గల మ్యాక్ సొసైటీ కాలనీ సొసైటీ డైరెక్టర్లతో కలిసి పలు సమస్యలపై చర్చించినట్లు వివరించారు. కార్యక్రమం లో వార్డ్ ఏఈ రమేష్ కుమార్, వార్డ్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంత్రి హరీష్‌రావుని కలిసిన పులిమామిడి స్రవంతి

శివ్వంపేట, ఆగస్టు 1 ప్రభాతవార్త: రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావును శివ్వంపేట మాజీ సర్పంచి పులిమామిడి స్రవంతి నవీన్‌కుమార్‌గుప్త మంగళవారం మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. నవీన్‌గుప్త హయాంలో శివ్వంపేట మండల కేంద్రం మరింత అభివృద్ధి చెందిందని మంత్రి హరీష్‌రావు అభినందిం చారు. మునుముందు కూడా పూర్తి సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. త్వరలో శివ్వంపేట మండలంలో పర్యటించి అభివృద్ధిని సమీ క్షిస్తానని మంత్రి అన్నారు. నవీన్ ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తేవాలని మంత్రి హరీష్‌రావు అన్నారు. స్రవంతి నవీన్‌కుమార్ గుప్త వెంట మండల పార్టీ అధ్యక్షులు వై. రమణాగౌడ్, మాజీ ఎంపిటీసీ సభ్యులు జంగం విజయ వెంకటేష్, సీనియర్ నాయకులు కమలయ్యగారి వెంకటేష్, వారాల గణేష్ పటేల్, ఇసారపు రాజుగౌడ్, ఇసారపు శ్రీనివాస్‌గౌడ్, వజ్జ నాగేష్ ఉన్నారు.

శివ్వంపేట మాజీ సర్పంచిని సన్మానిస్తున్న మంత్రి హరీష్‌రావు

ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలు

- అంగన్‌వాడీ .. అమ్మలకు ఒడి
- తగ్గిన బాలింత, శిశు మరణాలు
- ఆట పాటలతో పిల్లలకు చదువులు

తల్లులకుఅవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నారాయణఖేడ్, మనూరు, సిర్గాపూర్, ఆగస్టు 1, ప్రభాతవార్త

ఈనెల 1వ తేదీ నుంచి ది తల్లిపాల వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. బాల బాలికలకు, గర్భవతులకు, పేద మహిళలకు పుష్టికరమైన ఆహారం అందించడానికి ప్రభుత్వం అంగన్వాడీ వ్యవస్థను ప్రవేశపెట్టింది. స్త్రీ శిశు సంక్షేమ శాఖ తెలంగాణ రాష్ట్రా ప్రభుత్వ పర్యవేక్షణలో అంగన్వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఏడు నెలల బాలలకు, , ఆరు సంవత్సరాల లోపు బాల బాలికలకు సరైన పౌష్టికాహారం అందిస్తున్నారు. నాలుగు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ఆట పాటలతో చదువు నేర్పడం పౌష్టికాహారం అందించడం మహిళాలకు గర్భం దాల్చిన నుచి ప్రసావనంతరం వరకు పిల్లలకు ఆరు సంవత్సరాల వరకు పౌష్టికారం అందించడం ప్రభుత్వ అంగన్వాడీ కేంద్రాల ద్వారా నిర్వహిస్తుంది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్ల ఏటికేడు శిశు.. మరణాల రేటు తగ్గుముఖం పడుతున్నాయి. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కల్హేర్ మండలంలో 57 అంగన్వాడీ కేంద్రాలు, నారాయణఖేడ్, నిజాంపేట మండలంల్లో 111, నాగల్‌గిద్దా లో 67, కంగ్టిలో 72, సిర్గాపూర్‌లో 54 అంగన్వాడీ కేంద్రాల్లోలన పలువురు బాలింతలు, గర్భిణీ స్త్రీలు చిన్నారులకు అందిస్తున్నారు. మొత్తం నియోజకవర్గంలోని 361 అంగన్వాడీ కేంద్రాల్లో ఆగస్టు 1వ తేది నుంచి 7వ తేది వరకు తల్లిపాల వారోత్సవాలు జరుపనున్నట్లు సీడీపీఓ సూజత తెలిపారు. నియోజవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో ఆరోగ్య పథకంకింద తల్లులకు ఒక ప్యాకెట్ పౌష్టికాహారం, అదే విధంగా పిల్లలకు నెలకు 8 చొప్పున రెండు దఫాలుగా 16గుడ్లు ఇవ్వనున్నారు. అదే విధంగా ఒక పూట బోజనం అందించడంతోపాటు పాలు సైతం ఇవ్వడం ద్వారా ఆరోగ్యం పరిరక్షణ జరుగుతుంది. చంటి పిల్లలకు ఎదుగుదలకు ఏడు నెలల నుంచి సంవత్సరాల వరకు పిల్లలకు గుడ్లతో పాటు ఒకొక్కరికి ఒక్క ప్యాకెట్ బాలామృతం పంపిణీ చేయడం జరుగుతుంది. సమయానుసారంగా అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదల ఆరోగ్య సంరక్షణకై ఎత్తు బరువులతో పాటు వారి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి లోపం ఉన్న వారికి సరైన మందులతో పాటు, అంగన్వాడీ సెంటర్లతో బలమైన పౌష్టికారం అందించడం జరుగుతుందన్నారు. దీంతో పాటు పిల్లలకు ఆలసట లేకుండా చదువుతో పాటు ఆట పాటలతో చదువు కొనసాగిస్తున్నారు. పూర్వ ప్రాథమిక విద్యను బొమ్మల ద్వారా, చార్టుల ద్వారా ఆడుతూ పాడుతూ విద్య బోధనలు నేర్పించడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఆయా గ్రామ ప్రజలకు , తల్లులకు సమయానుసారంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి వాటిపై అవగాహన జరగుతుంది. అంతే కాకుండా కేందా్రల్లో పోషణ అభియన్ లాంటి కార్యక్రమాన్ని నిర్వహించి మహిళలు, గర్భిణులకు, అవగాహన కల్పిస్తుంటారు. అదే విధంగా ప్రతి నెల పిల్లలకి అన్న ప్రాసన,, గర్భవతి మహిళలకు శ్రీమంతం సైతం అంగన్వాడీ కేంద్రాలు అమ్మలకు వరమని చెప్పవచ్చును.

సిసి రోడ్డు నిర్మానం పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ రేఖా ప్రవీణ్

రూ.30 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం

జోగిపేట, ఆగస్టు 1, ప్రభాతవార్త: అందోలు–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డులో నూతనంగా సిసి రోడ్డు నిర్మాణం పనులను వార్డు కౌన్సిలర్ రేఖా ప్రవీణ్ మంగళవారంనాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డుకు ఎస్టీఎఫ్ నిధుల కింద రూ.30లక్షలు కేటాయించారని తెలపారు. ఈ నిధులతో వార్డులో అవసరం ఉన్న చోట సిసి రోడ్డు నిర్మాణం చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రం క్రిష్ణ, ఆకుల నాగేష్, కుమ్మరి క్రిష్ణ, చిట్యాల మధు, కుమ్మరి భాస్కర్ తదితరుల పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలతో లబ్ధిపొందాలి : డిఆర్‌డివో

స్వయం సహాయ సంఘం మహిళలతో మాట్లాడుతున్న డిఆర్‌డిఓ శ్రీనివాస్

పాపన్నపేట, ఆగస్టు 1, ప్రభాతవార్త: స్వయం సహాయ సంఘాలతో మహిళలు లబ్దిపొంది ఆర్థికంగా స్థిరపడాలని డిఆర్‌డిఓ అనంతుల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన యూనిట్లను శ్రీనివాస్ పరిశీలించారు. మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మంచి నూనె తయరీ యూనిట్‌ను, ఆరేపల్లిలో టీ గ్లాసుల తయారీ యూనిట్‌ను, మిన్‌పూర్‌లో బేకరీ, కొత్త లింగయ్యపల్లిలో విస్తరాకుల తయారీ, చీకోడ్‌లో పసుపు కారంపొడి అల్లం వెల్లులి తయారీ యూనిట్లను పరిశీలించారు. పాపన్నపేటలో మహిళలు ఏర్పాటు చేయబోయే వ్యవసాయ పరికరాల అద్దె కేంద్రాన్ని పరిశీలించి తయారు చేసిన, చేయబోతన్న యూనిట్‌ల ద్వార మహిళలు లబ్దిపొందాలని, చిన్నారులు విద్యను అందుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తపల్లి, ఆరేపల్లి గ్రామాల సర్పంచ్‌లు కుమ్మరి జగన్, శ్రీనాథ్‌రావు, ఐకెపి డిపిఎం మోహన్, ఏపియం జి సాయిలు, సీసీలు యాదయ్య, రాజు, శివరంజన్, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పిఆర్‌టియు సభ్యత్వాల అందచేత

ఉపాధ్యాయులకు సభ్యత్వాని అందచేసునతన్న పిఆర్‌టియు నాయకులు

జహీరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త: మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పిఆర్‌టియు సభ్యత్వాల నమోదు కార్యక్రమం శరవేగంగా కొనసాగుతోందని సంఘం మండల అధ్యక్షులు తులసీరామ్ రాథోడ్ అన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని ఆయా పాఠశాలల్లో సభ్యత్వాలు అందచేశామన్నారు. ఉపాధ్యాయుల సమక్షేమమే లక్ష్యంగా పిఆర్‌టియు పని చేస్తోందని, 2023 సంవత్సరానికి సంబంధించి సభ్యత్వాలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ వరాలు, ప్రదీప్‌కుమార్, మొగుడంపల్లి, రాయికోడ్ మండలాల అధ్యక్షులు చంద్రు రాథోడ్, విఠల్, జిల్లా ఉపాధ్యక్షులు జైపాల్‌రెడ్డి, జహీరాబాద్ అసోసియేషన్ అధ్యక్షులు యండి రఫిక్ హుస్సేన్, నాయకులు రమేష్ పవార్, గోవర్ధన్, పి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషన్‌కు సన్మానం

బదిలీపై వెళుతున్న మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న పులిమామిడి రాజు

సదాశివపేట, ఆగస్టు 1, ప్రభాతవార్త: సదాశివపేట మున్సిపల్ కమీషనర్ ఎన్ కృష్ణారెడ్డి బదిలీపై వెళుతుండటంతో బిఆర్ఎస్ రాష్ట్ర నేత, పిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు పులిమామిడి రాజు మంగళవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. 100 కోట్ల రూపాయలతో పట్టణాభివృద్ధికి కమషనర్ చేసిన సేవలను ఈ సందర్భంగా పులిమామిడి రాజు కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పిల్లోడి జయమ్మ, ఆయా వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కరస్‌గుత్తిలో కాలిదారి కోసం స్థలాన్ని సర్వే చేస్తున్న రెవిన్యూ అధికారులు

కరస్‌గుత్తిలో రహదారికి సర్వే

నాగల్‌గిద్ద, ఆగస్టు 1, ప్రభాతవార్త: మండలంలోని కరస్‌గుత్తి గ్రామంలో కాలినడకన వెళ్లేందుకు మంగళవారం రెవిన్యూ అధికారులు భూ సర్వే నిర్వహించారు. గ్రామంలోని 20, 25 సర్వే నంబర్‌లో గ్రామం నుంచి మావినెల్లి వరకు వెళ్లేందుకు స్థలాన్ని పరిశీలించారు. ఇటీవల గ్రామ సర్పంచ్ సంజురెడ్డి కాలినడకకు స్థలాన్ని చూపాలని జిల్లా కలెక్టర్‌లకు, స్థానిక శాసన సభ్యులకు పలు మార్లు వినతి చేయగా మంగళవారం రెవిన్యూ సర్వేయర్ గోపాల్ ఆధ్వర్యంలో సిబ్బంది సర్వే చేపట్టారు.

చండీయాగ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 1 ప్రభాతవార్త: శ్రీమహతి జ్యోతిష్యాలయం 15వ రోజు సందర్భంగా శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ రుద్ర చండీయాగ మహోత్సవ పూజలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.మంగళవారం పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. అనంతరం వేద పండితులు గురురాజశర్మ ఆశీస్సులు తీసుకుని తీర్థ ప్రసదాలు స్వీకరించారు. అనంతరం ఆయనకు పాండురంగారెడ్డి శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కె.భోజి రెడ్డి, శ్రీకాంత్ పీఎసీఎస్ చైర్మన్, ఏసురెడ్డి,రాజుసేట్ సాయిసంగమేశ్వర్, వెంకట్‌సాగర్, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించేదెప్పుడు ?

అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందచేస్తున్న పంచాయితీ కార్మికులు

ఝరాసంగం, ఆగస్టు 1, ప్రభాతవార్త: పంచాయతీ కార్మికులు న్యాయమైన డిమాండ్ల సాధనకోసం మాసం రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నా ప్రభుత్వానికి ఉలుకు పలుకు లేకపోవడం విడ్డూరంగా ఉందని బిఎస్‌పి అసెంబ్లి ఇంచార్జి సిద్దు రావణ్ విచారం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో పంచాయితీ కార్మికులతో కలిసి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి కనువిప్పు చేయాలని వినతి చేస్తూ వినతి పత్రం అందచేశారు. ఈ సందర్బంగా సిద్దు రావణ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు ప్రభుత్వం గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేచ్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకుంటే బిఎస్‌పి ఆధ్వర్యంలో ఆందోళనకు పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అంతకు ముందు పంచాయితీ కార్మికులతో ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో బిఎస్‌పి మండల అధ్యక్షులు ఇస్సం, అసెంబ్లి కార్యదర్శి రాహుల్, బాబురావు, నాయకులు రాజు, ప్రదీప్, యాదగిరి, మోజెస్, బన్నీ, అరుణ్, గోపాల్, పంచాయితీ కార్మికుల సంఘం అధ్యక్షుల సంగమేశ్వర్, పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్షించిన కార్పొరేటర్

-పనులు త్వరగా ప్రారంభించాలని సూచన

రామచంద్రాపురం, ఆగస్టు 1, ప్రభాతవార్త: రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో సండే మార్కెట్ వద్ద వార్డు కార్యాలయంలో మంగళవారం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ డీఈ నరేదందర్, జలమండలి మేనేజర్ జానర్ధన్‌లకు పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనుల కొరకు మంజూరైన నిధులతో సిసి రోడ్లు, డ్రైనేజి పైప్‌లైన్ పనులు త్వరంగా నాణ్యవంతంగా నిర్మించేందుకు శ్రీకారం చుట్టాలని సూచించారు. డ్రైనేజి లైన్ ప్రారంభిస్తే సిసి రోడ్డు వేయుటకు అవకాశం ఉంటుందని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ వివరించారు.

ఓపెన్ డ్రైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేయండి...

డివిజన్ పరిధిలోని మెయిన్ రోడ్డు రామచంద్రాపురం బస్‌స్టాప్ నుంచి హెచ్‌బి పెట్రోల్ పంప్ ముందు చిన్న పాటి వర్షానికి నీరు రోడులపైనే నిలుస్తుండటంతో ప్రజలు పరేషాన్ అవుతున్నారని, అందుకు నీరు రోడ్డుపై నిలబడకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఓపెన్ డ్రైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ డీఈ నరేందర్, జిహెచ్ఎంసి మాన్సూన్ బృందం సభ్యులు సూచించారు. అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపితే నిధుల మంజూరుకు కృషి చేస్తానని పుష్పనగేష్ అధికారులకు సూచించారు.

అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న కార్పోరేటర్ పుష్పనగేష్

బాల్య వివాహాల నిర్మూలనకై విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

బాల్య వివాహాల నిర్మూలపై అవగాహన

కొల్చారం, ఆగస్టు 1 ప్రభాతవార్త: మండల పరిధిలోని అంసానిపల్లి గ్రామంలో మంగళవారం కైలాష్ సత్యార్థి ఫౌండేషన్ సహకారంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కార్పెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోషల్ మొబిలైజర్ సత్యనారాయణ విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలన, హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయకూడదని, బాలల హక్కులు కాపడే విషయంలో అందరూ సహకరించాలన్నారు. సమాజంలో విద్యార్థుల కోసం నాలుగు రకాల హక్కులు కల్పించారని, అవి జీవించే హక్కు, రక్షణ హక్కు, అభివృద్ధి చెందే హక్కు, పాల్గొనే హక్కు అని, ఈ హక్కులను మనమే కాపాడుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతె బాల్య వివాహాలు చేయవద్దని ప్రతిజ్ఞ చేయించారు. అలాంటివి మాకు వినపడినా, తెలిస్తే సంబంధిత అధికారులకు, 1098 నెంబర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, చంద్రశేఖర్, ఆనంద్‌కుమార్, నవీన్ కుమార్, సునీత, ధనలక్ష్మీ, సంస్థ ప్రతినిధి సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్సు కోసం ఆర్‌టిఓలో యువత దరఖాస్తు

మునిపల్లి, ఆగస్టు 1, ప్రభాతవార్త: అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అర్హులైన యువతంగా డ్రైవింగ్ లైసెన్సులు అందించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం బిఆర్ఎస్ నేత పైతర సాయికుమార్ నేతృత్వంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 75 మంది యువకులు లైసెన్సుల కోసం సంగారెడ్డి ఆర్‌టిఓ కార్యాలయంలో ధరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నేత పైతర సాయికుమార్, మండల పార్టీ అధ్యక్షులు విజయకుమార్‌లు మాట్లాడుతూ ప్రతి యువత డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలని, లైసెన్సు లేనిదే వాహనాలు తోలితే కలిగే కష్టాలు, నష్టాలపై వివరించారు. ఆయా గ్రామాలకు చెందిన 100 మందికి లైసెన్సులు అందచేయడం జరిగిందని, ఇంకో 5వందల మంది ధరఖాస్తులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిఓ అధికారులు, బిఆర్ఎస్ నాయకులు నాగేష్, ధరఖాస్తు చేసుకున్న యువత పాల్గొన్నారు.

మండలంలో కొనసాగుతున్న వైద్య శిబిరాలు

న్యాల్‌కల్, ఆగస్టు 1, ప్రభాతవార్త: మండల కేంద్రమైన న్యాల్‌కల్, మిర్జాపూర్(బి) గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. న్యాల్‌కల్ పిహెచ్‌సి డాక్టర్లు గణపతి, వైశాలి ఆధ్వర్యంలో ఆసుపత్రి సిబ్బంది న్యాల్‌కల్‌లోని కస్తూర్భాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మిర్జాపూర్(బి) ఆసుపత్రి ఆధ్వర్యంలో మండలంలోని గుంజోటి, రుక్మాపూర్ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందు బిళ్లలను అందచేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా ఆసుపత్రులు డాక్టర్లు, మిర్జాపూర్ పిహెచ్‌సి పిహెచ్ఎన్ శ్యామల, ఎంపిహెచ్ఈఓ మల్కాపురం మల్లికార్జున్, జి.గణేశ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పి నాయామిషా, బి.పుణ్యావతి, ఎంపిహెచ్‌ఏ సువర్ణ, ఆయాగ్రామాల సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు శోభారాణి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వరి పంటను పరిశీలించిన ఎవో

వరి పంటను పరిశీలిస్తున్న ఏవో రాజశేఖర్

వెల్దుర్తి, ఆగస్టు 1 ప్రభాతవార్త: మాసాయిపేట మండల పరిధిలోని రామాంతాపూర్ గ్రామంలో మంగళవారం వరి పంటను మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాల కారణంగా వరి పంటలో ఎక్కువగా కాండం తొలుచు పురుగు ఆశిస్తుందన్నారు. దీనినివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 గ్రాములు, క్లోరట్లనిలిప్రోల్ 1.5 ఎంఎల్ లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవడం వల్ల కాండం తొలచు పురుగు ఉధృతిని తగ్గించ్చవచ్చన్నారు. అలాగే జూన్ 18వ తేదీ వరకు వరకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం వచ్చిన రైతులు రైతుభీమా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనికోసం పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డులతో సంబంధిత కార్యాలయంలో ఈ నెల 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రజిత, రైతులు పాల్గొన్నారు.

అన్నదాన వితరణ

శివ్వంపేట, ఆగస్టు 1 ప్రభాతవార్త: పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని తల్లిదండ్రులు జిన్నారం పెద్దగౌని లింగాగౌడ్, అంజమ్మల జ్ఞాపకార్థం శివ్వంపేటలో శ్రీ భగళాముఖి శక్తిపీఠంలో రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం పెద్దగౌని శివకుమార్‌గౌడ్ దంపతులు అన్నదాన వితరణ ఏర్పాటు చేయడం జరిగింది. భగళాముఖి శక్తిపీఠం ట్రస్టు సభ్యులుగా శివకుమార్‌గౌడ్ ఉన్న విషయం తెలిసిందే. శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీర్వాదంతో అందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రాతంలోని మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో శ్రీ భగళాముఖి శక్తిపీఠం నెలకొల్పడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శక్తిపీఠం ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ తదితరులు ఉన్నారు.

30 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

వెల్దుర్తి, ఆగస్టు 1 ప్రభాతవార్త: మండలంలోని పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని మండల పశు వైద్యాధికారి రసజ్ఞ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కళాన్‌శెట్టిపల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందస్తుగా గాలికుంటు వ్యాధి ప్రబలకుండా మండల వ్యాప్తంగా గోజాతి 2,141, గేదెలు 6,786 మొత్తం 8927 పశువులకు అన్ని గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఈ టీకాలు వేయడంవల్ల పశువులు బలహీన పడకుండా ఉంటాయన్నారు. రైతు సోదరులు ఈ అవాకశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమలో వెటర్నరీ సిబ్బంది ఫజలోద్దీన్, వేణుగోపాల్, ఖాజా పాల్గొన్నారు.

రాంతీర్థ్‌లో వైద్య శిబిరం

కంగ్టి, ఆగస్టు 1, ప్రభాతవార్త: మండలంలోని రాంతీర్థ్ గ్రామంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి చేరుకున్న ప్రజలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందు బిళ్లలు అందచేశారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా వర్షాలు కరియడంతో వాతావరణంలో మార్పుల వచ్చాయని, అందుకు ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలని ఎంఎల్‌హెచ్‌పి సంగమేశ్వర్ సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్‌వైజర్ సబితా, ఎఎన్ఎం అనిత, అంగన్‌వాడి టీచర్ సువర్ణ, ఆశ విటబాయి, లక్ష్మి, ముగులవ్వ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కల్హేర్, ఆగస్టు 1 ప్రభాతవార్త: మండల పరిధిలోని బాచేపల్లి గ్రామ శివారులోని ఉప్పలపోల నీటికుంటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు బాచేపల్లి గ్రామకార్యదర్శి తెలిపారు. మంగళవారం కార్యదర్శి కథనం ప్రకారం... గ్రామశివారులోని ఉప్పల పాలకుంట నీటిలో గుర్తు తెలియని మగ వ్యక్తి చనిపోయి కుంటలో వ్రేలాడుతున్నాడని ఆయన అన్నారు. వయస్సు సుమారుగా 30 నుంచి 35 సంవత్సరాల వరకు ఉంటుందన్నారు. శవం శరీరంపై గోదుమ రంగు కలర్ ప్యాంటు, మెరూన్ కలర్ షర్టు ధరించి ఉందన్నారు. గ్రామ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు న ప్రారంభిస్తున్నట్లు ఎస్.ఐ. తెలిపారు. శవంను గుర్తించినట్లయితే కల్హేర్ ఎస్.ఐ.కి ఫోన్‌సెల్ నెం. 8712656761, 8712656734 నెంబర్లకు సమాచారం అందించాలని అన్నారు.